# ప్రజా మంటలు

తెలంగాణ జాతీయ దినపత్రిక

ఎడిటర్ : సిహెచ్.వి. ప్రభాకర్ రావు

ప్రచురణ : జగిత్యాల సంపుటి : 05 సంచిక : 331 పేజిలు : 04 వెల రూ. 2 శనివారం 11 - 07 - 2026







## భద్రాద్రి రామయ్య మీద ఒట్టు

# మళ్లీ మాదే అధికారం

- తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి
- రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధులు విడుదల చేసిన సీఎం రేవంత్ రెడ్డి
- బహిరంగ సభలో కీలక వ్యాఖ్యలు
- 2029 జూన్‌లో ఎన్నికలు జరుగుతాయని సీఎం జోస్యం
- అప్పటికీ అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 182కు పెరుగుతాయని వెల్లడి
- పార్లమెంట్ స్థానాలు 17 నుంచి 25కు పెరుగుతాయని వివరణ
- జరగబోయే కురుక్షేత్రంలో గెలిచేది మేమే బీఆర్ఎస్‌కు సవాల్



హైదరాబాద్ :

వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2029 మే, జూన్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీలిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ యత్నిస్తోందన్న రేవంత్ రెడ్డి, అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, పార్లమెంట్ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయని వెల్లడించారు. భద్రాచలం రాముడి మీద ఒట్టు, వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ క్రమంలోనే కేసీఆర్, అతని బంధువులు, దొంగ సర్వేలను ఓడిస్తామని సవాల్ చేశారు. ప్రతిపక్షాలను ఓడించేందుకు రోజూ 18 గంటలు పని చేస్తామని, కేసీఆర్ - మిగతా 2 లో

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం'

# ఎలా ఉంటుందో చూపిస్తా



- తెలంగాణ రక్షణ సేన పార్టీ అధ్యక్షురాలు కవిత
- తమ ప్రభుత్వం వస్తే రైతును రాజును చేస్తానన్న కవిత
- పాంచజన్యం అనే నినాదంతో ముందుకు సాగుతామని వెల్లడి
- గిరిజనుల హక్కుల సాధన కోసమే పార్టీ పెట్టానన్న కవిత

హైదరాబాద్ :

తెలంగాణ రక్షణ సేన ఎన్నికల్లో విజయం సాధిస్తే 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో రుచి చూపిస్తానని ఆ పార్టీ అధ్యక్షురాలు కవిత అన్నారు. రైతును నిజమైన రాజును చేస్తానని స్పష్టం చేశారు. తమ ప్రభుత్వం ఏర్పడగానే ప్రతి ప్రభుత్వ ఆఫీసులో రైతులకు ప్రత్యేక - మిగతా 2 లో



## కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

- ఎంపీ ఈటల రాజేందర్
- నాకు తెలంగాణే మొదటి ప్రాధాన్యం.. ఆ తర్వాతే పార్టీ అన్న ఈటల
- ప్రభుత్వం వెంటనే మోటార్లు ఆన్ చేసి రైతులకు సాగునీరు అందించాలని డిమాండ్
- కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణాన్ని తప్పుబట్టడం దుర్మార్గమని కాంగ్రెస్‌పై విమర్శలు

హైదరాబాద్ :

ప్రజల ప్రయోజనాల విషయంలో తనకు తెలంగాణే మొదటి ప్రాధాన్యమని, ఆ తర్వాతే పార్టీ, వ్యక్తిగత అంశాలని మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. తాను ఎవరో చెప్పినట్లు మాట్లాడే వ్యక్తిని కాదని స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో శుక్రవారం మీడియాతో మాట్లాడిన ఆయన.. సాగునీటి నిర్వహణ, కాళేశ్వరం ప్రాజెక్టు, రైతుల - మిగతా 2 లో

# భారత తొలి హైడ్రోజన్ ట్రైన్‌కు రైల్వే శాఖ ఆమోదం

- జింద్- సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం
- 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు
- ఇప్పటికే జూన్‌లో దిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ పూర్తి



ఢిల్లీ :

భారతదేశపు తొలి హైడ్రోజన్ రైలు త్వరలోనే పట్టాలు ఎక్కనుంది. జింద్- సోనిపత్ మధ్య డైలీ హైడ్రోజన్ రైలు సర్వీసును ప్రవేశపెట్టడానికి రైల్వే మంత్రిత్వ శాఖ ఆమోదం తెలిపింది. ఈ మేరకు సంబంధిత వర్గాలు తెలిపాయి. 74010/74009 రైలు నంబర్లతో ఈ సర్వీసు నడుస్తుందని చెప్పాయి. జింద్ సిటీ, పాండు పిండారా, లలిత్ ఖేడా, భంబేవా, ఇషాపుర్ ఖేరి, బుటానా, ఖంద్రాయ్, గోహానా, రభ్రా, లాత్, మోహనా, హరియాణా, బర్వాస్ని స్టేషన్లలో వాణిజ్యపరమైన స్టాపులు ఉంటాయని వర్గాలు పేర్కొన్నాయి. ఇప్పటికే జూన్‌లో దిల్లీ- జింద్ మధ్య హైడ్రోజన్ రైలు ట్రయల్ రన్ పూర్తి - మిగతా 2 లో

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు

# కానీ లాభాలు ఎన్నో




- అధిక ఆక్టేన్, మెరుగైన పికప్ వంటి ప్రయోజనాలు ఉన్నాయని వివరణ
- ఈ20 అమలుకు ముందు ఆటో కంపెనీలతో సంప్రదింపులు జరిపామని వెల్లడి
- ఈ20 వల్ల వాహనాలకు నష్టం జరిగిందన్న ఆధారాలు లేవన్న కేంద్రం
- ఈ20తో కార్బన్ ఉద్గారాలు సుమారు 40 శాతం వరకు తగ్గుతాయని వెల్లడి

ఢిల్లీ :

ఈ20 (20 శాతం ఇథనాల్ కలిపిన పెట్రోల్) వినియోగంతో కొన్ని వాహనాల్లో మైలేజ్ 3-5 శాతం వరకు తగ్గే అవకాశం ఉందని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ తెలిపింది. అయితే మైలేజ్‌ను మాత్రమే ప్రమాణంగా చూడకూడదని, ఈ20 వల్ల అనేక కీలక ప్రయోజనాలు లభిస్తాయని స్పష్టం చేసింది. ఈ20 పెట్రోల్‌కు సాధారణ పెట్రోల్‌తో పోలిస్తే అధిక ఆక్టేన్ రేటింగ్, మెరుగైన యాంటీ-నాక్ లక్షణాలు ఉంటాయని పేర్కొంది. దీంతో ఇంజిన్ పనితీరు మెరుగుపడటంతో పాటు వాహనానికి మంచి పికప్, సాఫీ యాక్సిలరేషన్, శుభ్రమైన ఇంజిన్ నిర్వహణ వంటి ప్రయోజనాలు కలుగుతాయని వెల్లడించింది. ఈ20 అమలుకు ముందే ఆటోమొబైల్ తయారీ సంస్థలు, విడిభాగాల తయారీదారులు, పరిశోధనా సంస్థలతో విస్తృతంగా చర్చలు జరిపినట్లు మంత్రిత్వ శాఖ తెలిపింది. ఇంజిన్ పనితీరు, - మిగతా 2 లో

## అమర్‌నాథ్ యాత్రకు

# పోటెత్తిన భక్తులు

- 1.60 లక్షలు దాటిన దర్శనాలు
- అమర్‌నాథ్ యాత్రలో 1.60 లక్షలు దాటిన భక్తుల దర్శనాలు
- జమ్మూ నుంచి కశ్మీర్‌కు బయల్దేరిన మరో 8,796 మంది యాత్రికులు
- గత ఏడాదితో పోలిస్తే భక్తుల సంఖ్య పెరిగిందన్న లెఫ్టినెంట్ గవర్నర్



ఢిల్లీ :

అమర్‌నాథ్ యాత్ర-2026కు భక్తులు భారీ సంఖ్యలో తరలివస్తున్నారు. ఈ ఏడాది యాత్ర ప్రారంభమైన నాటి నుంచి ఇప్పటివరకు 1.60 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర గుహలో మంచు లింగాన్ని దర్శించుకున్నారు. యాత్ర సజావుగా కొనసాగుతున్న నేపథ్యంలో ఇవాళ జమ్మూలోని భగవతి నగర్ యాత్రి నివాస్ నుంచి 8,796 మంది యాత్రికులతో కూడిన తొమ్మిదో బృందం కశ్మీర్ లోయకు బయల్దేరింది. ఈ బృందంలో 3,350 మంది బల్తాల్ బేస్ క్యాంపునకు, మరో 5,346 మంది పహల్గామ్ బేస్ క్యాంపునకు ప్రత్యేక భద్రతా కాన్వాయ్‌ల నడుమ వెళ్లారు. యాత్రికులలో 6,426 - మిగతా 2 లో

## చైనా మెగా డ్యామ్‌కు పొంత


# శాస్త్రవేత్తల హెచ్చరిక

- పొంచివున్న పెను ప్రమాదం!
- బ్రహ్మపుత్ర నదిపై చైనా నిర్మిస్తున్న మెగా డ్యామ్‌కు ముప్పు
- క్రియాశీలక ఫాల్ట్ లైన్‌పై డ్యామ్ నిర్మాణం జరుగుతోందని వెల్లడి
- భూకంపాలు, కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉందని హెచ్చరిక
- భారత్, బంగ్లాదేశ్‌పై తీవ్ర ప్రభావం పడుతుందన్న ఆందోళనలు



2 లో

## ప్రజానాడి




# అమరావతికి 'శాంసంగ్ సిటీ'

- కొరియా కంపెనీలతో మంత్రి లోకేశ్ కీలక భేటీలు
- ఏపీలో బ్యాటరీ తయారీ యూనిట్ ఏర్పాటుకు డెల్టా ఎక్స్‌కు ఆహ్వానం
- అమరావతిలో 'శాంసంగ్ సిటీ'కి లోకేశ్ ప్రతిపాదన
- ప్రతిపాదనలను ఉన్నతస్థాయి బృందంతో చర్చిస్తామన్న శాంసంగ్ ప్రతినిధులు



అమరావతి :

ఆంధ్రప్రదేశ్‌ను అత్యాధునిక సాంకేతికత, పారిశ్రామిక పెట్టుబడులకు గమ్యస్థానంగా మార్చే లక్ష్యంతో రాష్ట్ర ఐటీ, విద్యా, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ తన దక్షిణ - మిగతా 2 లో

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

- చంద్రబాబు కేబినెట్ కీలక నిర్ణయాలు
- సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ భేటీ
- కీలక నిర్ణయాలకు ఆమోదం
- సోషల్ మీడియా దుర్వినియోగాన్ని అరికట్టేందుకు రాష్ట్రస్థాయి టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు
- రూ.31,431 కోట్ల విలువైన పెట్టుబడులకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం
- అమరావతిలో భూములిచ్చిన రైతులకు వార్షిక కౌలు పెంపు.. కీలక నిర్ణయం



అమరావతి :

ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన రాష్ట్ర మంత్రిమండలి సమావేశం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. రాష్ట్ర ఆర్థిక ప్రగతి, పెట్టుబడుల ఆకర్షణ, అమరావతి నిర్మాణం, సంక్షేమ పథకాల అమలు, సోషల్ మీడియా నియంత్రణ వంటి అనేక అంశాలపై కేబినెట్ సుదీర్ఘంగా చర్చించింది. సమావేశం అనంతరం మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు వివరాలు వెల్లడించారు. సోషల్ మీడియా దుర్వినియోగాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న ప్రభుత్వం, దానిని అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోబోతోందని ఆయన స్పష్టం చేశారు.

### సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

సమాజానికి సోషల్ మీడియా దుర్వినియోగం ఒక రోగంలా పరిణమించిందని, దాని వల్ల మేలు కంటే కీడే ఎక్కువగా జరుగుతోందని కేబినెట్ అభిప్రాయపడింది. వ్యక్తిత్వ హననం, ప్రభుత్వాలపై అబద్ధపు ప్రచారం, మహిళలను కించపరచడం వంటివి శ్రుతిమించుతున్నాయని ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో సోషల్ మీడియాలో అనైతిక కార్యకలాపాలను ఏమాత్రం ఉపేక్షించకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారని మంత్రి పార్థసారథి తెలిపారు. దీని కోసం కొన్ని కీలక చర్యలను కేబినెట్ ఆమోదించిందని వివరించారు. రాష్ట్ర స్థాయిలో ఒక - మిగతా 2 లో

# సంపాదకీయం

## ఏనాటి బంధమో ఇది..!



స్వదేశంలో నెహ్రూను తీవ్రంగా విమర్శించే ప్రధాని నరేంద్రమోదీ మంగళవారం ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి చేసిన ప్రసంగంలో భారత తొలిప్రధాని పేరు ప్రస్తావించారు. ఏ మాత్రం కష్టపడకుండా ఇండోనేషియా అత్యున్నత గౌరవపురస్కారాన్ని మోదీ దక్కించుకున్నారన్న అర్థంవచ్చేలా కాంగ్రెస్ ఓ విమర్శ చేసింది కానీ, ఉభయదేశాల సంబంధాలకు పునాదిపడిన అలనాటి రోజులనూ, అప్పటి పరిస్థితులను కాస్తంతైనా ప్రస్తావించకుండా, కారకుడైన నెహ్రూను స్మరించకుండా వర్తమానంలో బలమైన బంధం నెలకొల్పడం సాధ్యం కాదని మోదీకి తెలుసు. ఆయన తన ప్రసంగంలో బాండుంగ్ కాన్ఫరెన్సు గురించీ, అలీన విధానానికి సుకర్ణో--నెహ్రూల బలమైన పునాదుల గురించి ప్రస్తావించారు. రెండేళ్ళ తేడాలో స్వాతంత్ర్యాన్ని పొందిన ఈ రెండు దేశాలూ తమ వలసవాద వ్యతిరేక పోరాటంతో అనేక దేశాలకు స్ఫూర్తినిచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆగస్టు 17, 1945లో డచ్ పాలననుంచి ఇండోనేషియా స్వాతంత్ర్యం ప్రకటించుకోగానే, ప్రధాని సుతాన్ జహ్రీర్, ఉపాధ్యక్షుడు మహ్మద్ హట్టాలను డచ్‌సైన్యం గృహనిర్బంధంలో ఉంచితే, భారత వైమానిక దళంలో పైలట్‌గా పనిచేస్తున్న బిజూ పట్నాయక్, కోపైలట్ అయిన తన భార్య జ్ఞానవతీ పట్నాయక్‌తో కలిసి ఒక డకోటా విమానంలో ఇండోనేషియా వెళ్ళి వారిని రక్షించిన ఘట్టాన్ని కూడా మోదీ గుర్తుచేశారు. నెహ్రూ ఆదేశాల మేరకు బిజూభాయ్ అత్యంత సాహసోపేతంగా ఈ కర్తవ్యాన్ని పూర్తిచేసిన విషయం తెలిసిందే. డచ్‌తో ఇండోనేషియా తీవ్రంగా పోరాడుతున్న ఆ కాలంలో, అక్కడ నిర్బంధంలో ఉన్న ఈ ఇండోనేషియా కీలకనేతలిద్దరినీ రక్షించే క్రమంలో విమానాన్ని కూల్చివేస్తామన్న డచ్ సైన్యం హెచ్చరికలను సైతం బిజూ పట్నాయక్ లక్ష్యపెట్టలేదు. తన ఈ చిన్న విమానానికి ఏ మాత్రం హాని జరిగినా దానిని భారతదేశం మీద దాడిగా భావిస్తామని బెదిరించి మరీ ఆ నేతలిద్దరినీ సింగపూర్ మీదుగా ఢిల్లీ చేర్చారు బిజూభాయ్. 1950లో భారతదేశ తొలి గణతంత్ర దినోత్సవానికి ఇండోనేషియా తొలి అధ్యక్షుడు సుకర్ణో ముఖ్య అతిథిగా విచ్చేయడం ఇరుదేశాల స్నేహబంధానికి నిదర్శనమని మోదీ వ్యాఖ్యానించారు. సుకర్ణో కుమార్తెకు మేఘావతి అని నామకరణం చేసింది కూడా బిజూ పట్నాయకేనని అంటారు. ఇండియా--ఇండోనేషియా బంధానికి ఉన్న బలమైన పునాదిని వివరించే క్రమంలో కొన్ని ఉద్దేశపూర్వకమైన విస్మరణలు జరిగినప్పటికీ, ఎనిమిది దశాబ్దాలనాటి ఆ సంఘటనలను ఉపరితలంలోనైనా ప్రస్తావించినందుకు మోదీని అభినందించాల్సిందే. ఇండోనేషియా పార్లమెంట్‌ను ఉద్దేశించి భారతప్రధాని ప్రసంగించడం ఇదే తొలిసారి. ఉభయదేశాల భాగస్వామ్యంలో ఒక సువర్ణ అధ్యాయం ఆరంభమవుతోందన్నారు మోదీ. భారతప్రధాని పర్యటనలో యుద్ధవిమానాలు, ఎర్రతివాచీల స్వాగతాల నుంచి అడుగడుగునా ఆ దేశం కనబరచిన గౌరవం బలమైన పునాదికి నిదర్శనం. నరేంద్రమోదీ తనకు ఆదర్శమనీ, ఆయన పథకాలను కాపీకొడతానని చమత్కరించి మరీ ఎంతో ఆత్మీయతను ప్రకటించారు ఇండోనేషియా అధ్యక్షుడు ప్రబవో సుబియాంతో. ఆపరేషన్ సిందూర్‌లో కీలకపాత్ర పోషించిన 'బ్రహ్మోస్', 'అస్త్ర' క్షిపణుల కొనుగోలుకు ఇండోనేషియా నిర్ణయించుకోవడం విశేషమైన పరిణామం. దాదాపు ఎనిమిదేళ్ళుగా చర్చోపచర్చలు జరుగుతూ, సైనికరంగ ప్రముఖుల రాకపోకలు సాగుతూవచ్చిన అంశమిది. రక్షణలోనే కాదు, నౌకాయానం, కీలక ఖనిజాలు,అంతరిక్షం, ఆహారభద్రత, ఔషధాలు ఇత్యాది చాలా రంగాల్లో సహకారం మెండుగా ఉండబోతోంది. అండమాన్--నికోబార్ దీవులకు సమీపంగా ఉన్న సబాంగ్ ఓడరేవును ఉమ్మడిగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదన వ్యూహాత్మకంగా ఉపకరిస్తుంది. ఇండోనేషియా చెల్లింపుల వ్యవస్థతో మన యూపీఐ అనుసంధానం ఆర్థికబంధంలో కీలకమైన అడుగు. రెండుదేశాల తీరరక్షకదళాలు సమష్టిగా పనిచేయాలన్న నిర్ణయం మన భద్రతకు ఉపకరిస్తుంది. హిందూమహాసముద్రాన్ని పసిఫిక్ మహాసముద్రంతో కలిపే నాలుగు జలసంధుల మధ్య ఇండోనేషియా ఉన్నందున ఒక వ్యూహాత్మక భాగస్వామిగా దాని సహకారం మనకు ఎంతో అవసరం. నికెల్ నిలువలు అత్యధికంగా ఉన్న ఈ దేశంతో ఉత్పత్తి, శుద్ధి, ఎగుమతుల విషయంలో ఇచ్చిపుచ్చుకోవడం మన విద్యుత్ వాహనాల తయారీకి తోడ్పడుతుంది. మోదీ పర్యటనలో కుదిరిన పద్నాలుగు ఒప్పందాలూ అవగాహనలూ ఉభయదేశాల మధ్యా సాన్నిహిత్యాన్నీ సహకారాన్నీ మరింత పెంచుతాయి.

## భారత తొలి హైడ్రోజన్ ట్రైన్‌కు రైల్వే శాఖ ఆమోదం

**మొదటిపేజీ తరువాయి -** చేశారు. ఇందులో అత్యవసర బ్రేకింగ్ దూరం, రైలు డోలనం వంటి కీలక అంశాలపై దృష్టి సారించారు.

## ఈ20 పెట్రోల్‌తో మైలేజ్ 3-5% తగ్గొచ్చు.. కానీ లాభాలు ఎన్నో

**మొదటిపేజీ తరువాయి -** ఇంధన వ్యవస్థ, మన్నిక, ఉద్గారాలు, ఇంధన సామర్థ్యం వంటి అన్ని అంశాలను సమగ్రంగా పరిశీలించిన తర్వాతే ఈ20 అమలు చేపట్టినట్లు పేర్కొంది.వాహన తయారీ సంస్థలు పూర్తిగా సంతృప్తి చెందకపోతే ఈ20కు మద్దతు ఇచ్చేవి కాదని, వాహనాల వారంటీలను కూడా కొనసాగించేవి కాదని మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. ప్రస్తుతం దాదాపు అన్ని కంపెనీలు పాత, కొత్త వాహనాలకు వారంటీ ఇస్తుండటమే దీనికి నిదర్శనమని పేర్కొంది. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మారుతీ సుజుకీ 2.84 కోట్ల వాహనాలకు సర్వీసింగ్ చేయగా, అందులో 1.5 కోట్ల పాత ఈ20 సర్టిఫికేషన్ లేని వాహనాలు కూడా ఉన్నాయని తెలిపింది. అయినప్పటికీ ఈ20 కారణంగా తుప్పు పట్టడం, విడిభాగాలు దెబ్బతినడం లేదా అసాధారణ అరుగుదల వంటి సమస్యలు ఏవీ గుర్తించలేదని వెల్లడించింది. హీరో మోటోకార్ప్ కూడా ఇదే తరహా అనుభవాన్ని నివేదించినట్లు తెలిపింది.అలాగే ఈ20 వాడకంతో సూక్ష్మ రేణువుల ఉద్గారాలు చాలా తక్కువగా ఉంటాయని, మొత్తం కార్బన్ ఉద్గారాలు సుమారు 40 శాతం వరకు తగ్గుతాయని కేంద్రం పేర్కొంది. ఇథనాల్ ఉత్పత్తి, నిల్వ, రవాణా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వ రంగ బ్యాంకులు ప్రతి ఏడాది సుమారు రూ.లక్ష కోట్ల మేర పెట్టుబడులకు రుణాలు అందిస్తున్నాయని మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## 'అన్న రాజ్యం' కాదు.. 'అక్క రాజ్యం' ఎలా ఉంటుందో చూపిస్తా



**మొదటిపేజీ తరువాయి -** గౌరవ కుర్చీలు ఏర్పాటు చేస్తామన్నారు. మహిళల కోసం ఒక వినూత్న ఆలోచన చేశామని... త్వరలోనే దాని వివరాలు ప్రకటిస్తానని చెప్పారు. 'పాంచజన్యం' అనే నినాదంతో మార్పు కోసం ముందుకు సాగుతామని పేర్కొన్నారు .భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావు పేట మండలంలోని కొత్త గంగారం తదితర ఆదివాసి గ్రామాల్లో పర్యటించిన కవిత, స్థానికుల జీవన విధానాన్ని, సమస్యలను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... వెనకబడిన గిరిజనుల హక్కుల సాధన కోసమే తాను తెలంగాణ రక్షణ సేనను స్థాపించానని, ఇక్కడికి వచ్చింది రాజకీయాల కోసం కాదని, ప్రజా సమస్యల పరిష్కారం కోసమేనని స్పష్టం చేశారు. 1950 రికార్డుల్లో నాయకపోడు తెగ పేరు లేకపోవడంపై ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజనుల హక్కుల సాధనకై అవసరమైతే ఢిల్లీ వేదికగా పోరాడతామన్నారు. కార్పొరేట్ శక్తుల వేల కోట్ల అప్పులు మాఫీ చేసిన కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం... ఆదివాసి బిడ్డలు బైక్ కొందామన్నా బ్యాంక్ లోన్లు ఎందుకు ఇవ్వడం లేదని కవిత నిలదీశారు. విదేశాల తరహాలోనే ఇక్కడి గిరిజనులకు కూడా రూ.2 లక్షల నుండి రూ.2 కోట్ల వరకు సులభంగా లోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను ప్రభుత్వం పక్కదారి పట్టిస్తోందని ఆరోపించిన ఆమె, ఆదివాసి పిల్లలందరికీ ఉచిత విద్య, వైద్యం అందించడం వారి ప్రాథమిక హక్కు అని గుర్తుచేశారు. ఏది సాధించాలన్నా ముందు ఒక్క అడుగుతోనే ప్రారంభమవుతుందని... అందరి సహకారం తనకు కావాలని కోరారు.

# సోషల్ మీడియా దుర్వినియోగంపై ఉక్కుపాదం

**మొదటిపేజీ తరువాయి -** 'సోషల్ మీడియా రెస్పాన్స్ సెల్' ఏర్పాటు.

దుర్వినియోగం, విద్వేష ప్రచారాలను అరికట్టేందుకు 'రాష్ట్ర స్థాయి టాస్క్‌ఫోర్స్' ఏర్పాటు.

విద్వేషాలు వ్యాప్తి చేసే హ్యాండిల్స్‌ను గుర్తించడానికి ఆధునిక ఫారెన్సిక్ టూల్స్ కొనుగోలుకు నిధులు.

సోషల్ మీడియా కేసుల దర్యాప్తుపై ఎస్‌హెచ్‌ఓలకు ప్రత్యేక శిక్షణ, సైబర్ పరిజ్ఞానం ఉన్న పబ్లిక్ ప్రాసిక్యూటర్ల (పీపీల) నియామకం.ఇతర దేశాల్లోని చట్టాలను అధ్యయనం చేసి, అవసరమైతే ప్రత్యేక చట్టం తీసుకురావడంపై పరిశీలన.రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహాన్ని పెంచే లక్ష్యంతో స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డ్ (ఎస్ఐపీబీ) ఆమోదించిన ప్రతిపాదనలకు కేబినెట్ ఆమోదం తెలిపింది. మొత్తం 13 ప్రాజెక్టులకు సంబంధించి రూ.31,431 కోట్ల పెట్టుబడులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. వీటి ద్వారా రాష్ట్రంలో 31,431 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. తిరుపతి జిల్లా శ్రీసిటీలో మాండెలెజ్ ఇండియా ఫుడ్స్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.1801 కోట్లతో ఏర్పాటు చేయనున్న చాక్లెట్ తయారీ యూనిట్ వీటన్నింటిలో ముఖ్యమైనది. ఈ యూనిట్ ద్వారా దేశంలోనే కోకో వినియోగించి చాక్లెట్లు తయారు చేయడంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానానికి చేరుకుంటుందని మంత్రి వివరించారు. అలాగే వేస్ట్ ఆయిల్స్‌ను ఏవియేషన్ ఫ్యూయల్‌గా మార్చేందుకు ఎస్ఏఎఫ్ఎఫ్ ఇండియా ఏర్పాటు చేయనున్న పరిశ్రమకు కూడా ఆమోదం తెలిపారు.అమరావతికి సంబంధించి కేబినెట్ పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంది. రాజధానిలో భూములు ఇచ్చిన రైతులకు ఊరట కల్పిస్తూ వార్షిక కౌలును పెంచింది. జూన్ 12, 2024 తర్వాత ల్యాండ్ పూలింగ్ స్కీమ్ కింద భూములు ఇచ్చిన రైతులకు ఈ పెంపు వర్తిస్తుంది. మెట్ట భూములకు ఎకరాకు రూ.30,000 నుంచి రూ.40,000కు, జరీబు భూములకు రూ.50,000 నుంచి రూ.60,000కు వార్షిక కౌలును పెంచుతూ నిర్ణయం తీసుకున్నారు. వీరికి 10 సంవత్సరాల పాటు ఈ కౌలు చెల్లిస్తారు. అలాగే, గ్రామ కంఠాల్లో ఇళ్లు కోల్పోయిన నిర్వాసితులకు ఇచ్చే నెలవారీ పరిహారాన్ని రూ.5,000 నుంచి రూ.10,000కు పెంచుతూ 12 నెలల పాటు అందించాలని తీర్మానించారు. వీటితో పాటు, అమరావతిలో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు, ఈషా ఫౌండేషన్, ఆర్ట్ ఆఫ్ లివింగ్, సీఐఐ గ్లోబల్ లీడర్‌షిప్ సెంటర్ వంటి సంస్థలకు భూ కేటాయింపులకు ఆమోదం తెలిపారు. ముఖ్యంగా, నేషనల్ ఫిషరీస్ బోర్డు ఆధ్వర్యంలో అంతర్జాతీయ స్థాయిలో అక్వేరియం, ఆర్నమెంటల్ ఫిష్ బ్రీడింగ్ సెంటర్ ఏర్పాటు కానుంది.సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే లక్ష్యంతో ప్రభుత్వం కీలక అడుగు వేసింది. సాంఘిక సంక్షేమ గురుకులాల్లో చదివే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఐటీ-జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలకు అత్యుత్తమ శిక్షణ ఇచ్చేందుకు మూడు "సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్" ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. వీటిని విశాఖపట్నం, నెల్లూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో ఏర్పాటు చేస్తారు. కార్పొరేట్ సంస్థలకు దీటుగా నాణ్యమైన శిక్షణ ఇచ్చి, పేద విద్యార్థులను ఐఐటీలు, ఐఐఎంలలో సీట్లు సాధించేలా తీర్చిదిద్దడమే లక్ష్యమని మంత్రి పార్థసారథి తెలిపారు.సాగు, తాగునీటి ప్రాజెక్టులపై కేబినెట్ ప్రత్యేకంగా దృష్టి సారించింది. పెద్దగడ్డ రిజర్వాయర్ ప్రాజెక్టు పనులకు సంబంధించి ఐదుసార్లు టెండర్లు విఫలమైన నేపథ్యంలో, 14.88 శాతం ఎక్కువకు కోట్ చేసిన టెండర్‌ను ఆమోదించింది. కుప్పం బ్రాంచ్ కెనాల్ నుంచి చెరువులకు నీటిని అందించే పనులకు రూ.67.98 కోట్లకు పరిపాలన ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా 'జలధార' కార్యక్రమం పురోగతిని సమీక్షించాలని, ఎల్ నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు తాగునీరు, పశుగ్రాసంపై ముందస్తు చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించినట్లు మంత్రి వెల్లడించారు. దశాబ్దాలుగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం దృష్టి సారించింది. గుంటూరు జిల్లా పుల్లడిగుంట గ్రామంలో దశాబ్దాలుగా నివసిస్తున్న 200 కుటుంబాలకు ఊరట కల్పిస్తూ, వారు నివసిస్తున్న 10.16 ఎకరాల 'తోపు పోరంబోకు' భూమిని పట్టా భూమిగా మార్చేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో ఇలాంటి భూ వర్గీకరణ సమస్యలతో ఇబ్బంది పడుతున్న వేలాది కుటుంబాలకు న్యాయం చేస్తామని, మార్చి 2027 నాటికి పరిష్కరించగల అన్ని రెవెన్యూ సమస్యలను పూర్తి చేయాలని సీఎం అధికారులను ఆదేశించారని మంత్రి పేర్కొన్నారు.కాగా, ఈ కేబినెట్ సమావేశానికి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రులు నారా లోకేశ్, టీజీ భరత్ గైర్హాజరయ్యారు. పవన్ భుజం శస్త్రచికిత్స కోసం ముంబై వెళ్లనున్న నేపథ్యంలో ఆయన నేటి సమావేశానికి దూరంగా ఉన్నారు. ఇక, ఐటీ మంత్రి నారా లోకేశ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి టీజీ భరత్ ప్రస్తుతం దక్షిణ కొరియా పర్యటనలో ఉన్న సంగతి తెలిసిందే.

# అమరావతికి 'శాంసంగ్ సిటీ'

**మొదటిపేజీ తరువాయి -** కొరియా పర్యటనలో కీలక సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ సిస్టమ్స్ (బీఈఎస్ఎస్) తయారీలో పేరొందిన డెల్టా ఎక్స్, ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ కంపెనీల ఉన్నతాధికారులతో ఆయన వేర్వేరుగా భేటీ అయ్యారు. ఏపీలో భారీ ఎత్తున తయారీ, పరిశోధన యూనిట్లను స్థాపించాలని ఆయన ఈ కంపెనీలను ఆహ్వానించారు. సియోల్‌లో డెల్టా ఎక్స్ ఫౌండర్, సీఈవో స్టీఫెన్ కిమ్‌తో మంత్రి లోకేశ్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆంధ్రప్రదేశ్ 160 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ, 25 గిగావాట్ల బ్యాటరీ ఎనర్జీ స్టోరేజ్ ప్రాజెక్టుల లక్ష్యంతో ముందుకు సాగుతోందని వివరించారు. ఈ ప్రణాళికలకు అనుగుణంగా రాష్ట్రంలో సోలార్ మాడ్యూళ్లు, బ్యాటరీ సెల్స్ తయారీకి అనువైన పర్యావరణాన్ని నిర్మిస్తున్నామని తెలిపారు. పోర్టులు, మౌలిక సదుపాయాలు పుష్కలంగా ఉన్న ఏపీలో ఒక బీఈఎస్ఎస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేయాలని ఆయన డెల్టా ఎక్స్‌ను కోరారు. దీనికి డెల్టా ఎక్స్ సీఈవో స్టీఫెన్ కిమ్ సానుకూలంగా స్పందించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆంధ్రప్రదేశ్‌లో తయారీ యూనిట్ ఏర్పాటుపై త్వరలోనే సానుకూల నిర్ణయం తీసుకుంటామని ఆయన మంత్రికి తెలిపారు.

### శాంసంగ్‌కు భారీ ప్రతిపాదనలు

అనంతరం, ప్రపంచ ఎలక్ట్రానిక్స్ దిగ్గజం శాంసంగ్ ఎలక్ట్రానిక్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ యంగ్ జో యున్‌తో మంత్రి లోకేశ్ భేటీ అయ్యారు. ఈ సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌లో పెట్టుబడులకు గల అవకాశాలను వివరిస్తూ పలు ప్రతిపాదనలు చేశారు.ఏఐ, డేటా సెంటర్ హబ్: రాష్ట్రంలోని 10 గిగావాట్ల డేటా సెంటర్ పైప్‌లైన్‌ను ఉపయోగించుకుని, ఏఐ-కంప్యూట్, సర్వర్ తయారీ, సర్వీసింగ్‌లో ఆంధ్రప్రదేశ్‌ను శాంసంగ్‌కు ప్రధాన కేంద్రంగా మార్చాలని లోకేశ్ కోరారు.తయారీ యూనిట్లు: ఏపీలో ఒక డిస్‌ప్లే ఫ్యాబ్, విశాఖపట్నంలోని ఐఎస్ఎం ఓఎస్ఏటీ క్లస్టర్‌ను ఆధారంగా చేసుకుని కన్స్యూమర్ ఎలక్ట్రానిక్స్, మొబైల్స్ కోసం ఒక సెమీకండక్టర్ యూనిట్ (ఓఎస్ఏటీ) ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, రాష్ట్ర పునరుత్పాదక ఇంధన లక్ష్యాలకు మద్దతుగా మొబైల్, డివైస్ బ్యాటరీ తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.అమరావతిలో భాగస్వామ్యం: రాజధాని అమరావతి నిర్మాణం, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పనలో శాంసంగ్ భాగస్వామి కావాలని ఆహ్వానించారు. అమరావతి క్వాంటం వ్యాలీలో శాంసంగ్ ఆర్‌డీ విభాగాన్ని నెలకొల్పాలని సూచించారు.శాంసంగ్ సిటీ: వీటన్నిటికీ మించి శాంసంగ్ బహుళ విభాగాలకు ఒకేచోట నిలయంగా ఉండేలా ఏపీలో ఒక ప్రత్యేక 'శాంసంగ్ సిటీ'ని నిర్మించాలన్న భారీ ప్రతిపాదనను కూడా లోకేశ్ వారి ముందుంచారు.మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రతిపాదనలపై శాంసంగ్ ప్రతినిధులు స్పందిస్తూ, తమ సంస్థ ఉన్నతస్థాయి బృందంతో చర్చించి నిర్ణయం వెల్లడిస్తామని తెలిపారు. మొత్తం మీద, గ్రీన్ ఎనర్జీ, హై-టెక్ తయారీ రంగాలలో కొరియా దిగ్గజాలను ఏపీకి ఆకర్షించేందుకు మంత్రి లోకేశ్ చేసిన ఈ ప్రయత్నాలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి. ముఖ్యంగా డెల్టా ఎక్స్ నుంచి సానుకూల స్పందన రావడం రాష్ట్రానికి శుభపరిణామంగా భావిస్తున్నారు.

# చైనా మెగా డ్యామ్‌కు సొంత శాస్త్రవేత్తల హెచ్చరిక

**మొదటిపేజీ తరువాయి -** బ్రహ్మపుత్ర నదిపై చైనా భారీ స్థాయిలో నిర్మిస్తున్న మెగా హైడ్రోపవర్ ప్రాజెక్టు భద్రతపై తీవ్ర ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ డ్యామ్ నిర్మాణ ప్రాంతం కింద ఒక క్రియాశీలక ఫాల్ట్ లైన్ (భూఫలకల మధ్య పగులు) ఉన్నట్లు చైనాకు చెందిన జియాలజిస్టులే స్వయంగా హెచ్చరించారు. దీనివల్ల ఆ ప్రాంతంలో భూకంపాలు సంభవించే, కొండచరియలు విరిగిపడే ప్రమాదం పొంచి ఉందని వారి అధ్యయన నివేదిక వెల్లడించింది. ఈ నివేదిక గత నెలలో ప్రచురితమైంది.టిబెట్‌లోని యార్లుంగ్ త్సాంగ్పో నదిపై (భారత్‌లోకి ప్రవేశించిన తర్వాత బ్రహ్మపుత్రగా పిలుస్తారు) ఈ భారీ డ్యామ్ నిర్మాణాన్ని చైనా 2025లో ప్రారంభించింది. ఇది పూర్తయితే ప్రపంచంలోనే అతిపెద్ద జలవిద్యుత్ ప్రాజెక్టుగా నిలవనుంది. చైనాలోని త్రీ గోర్జెస్ డ్యామ్ కంటే మూడు రెట్ల అధికంగా, ఏటా సుమారు 300 బిలియన్ కిలోవాట్ గంటల విద్యుత్‌ను ఇది ఉత్పత్తి చేస్తుందని అంచనా వేస్తున్నారు.చైనా జియోలాజికల్ సర్వే ఆధ్వర్యంలో చెంగ్డూ యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నిపుణులు ఈ అధ్యయనం నిర్వహించారు. డ్యామ్ నిర్మిస్తున్న ప్రాంతంలో 'పైజెన్ ఫాల్ట్' అనే ఫాల్ట్ లైన్ ఉందని, ఇది నిరంతరం కదులుతూ ఉండటం వల్ల అక్కడి శిలలు బలహీనపడ్డాయని వారు గుర్తించారు. డ్యామ్‌లో నీటిని నింపినప్పుడు లేదా భూకంపం సంభవించినప్పుడు కొండచరియలు విరిగిపడే ముప్పు అధికంగా ఉంటుందని నివేదికలో స్పష్టం చేశారు. హిమాలయ పర్వత శ్రేణుల్లోని ఈ ప్రాంతం సహజంగానే భూకంపాల ప్రభావానికి ఎక్కువగా గురవుతుందని వారు గుర్తుచేశారు. ఈశాన్య రాష్ట్రాలతో పాటు బంగ్లాదేశ్‌కు బ్రహ్మపుత్ర నది ప్రధాన జీవనాధారం. ఈ నదిపై చైనా చేపడుతున్న ప్రాజెక్టుల వల్ల నీటి ప్రవాహానికి ఆటంకం కలుగుతుందని, పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతుందని భారత్ చాలాకాలంగా ఆందోళన వ్యక్తం చేస్తోంది. తాజా భౌగోళిక అధ్యయన నివేదిక వెలువడటంతో ఈ ఆందోళనలు మరింత తీవ్రమయ్యాయి.

## ఏపీలో మళ్లీ కరోనా కలకలం

**మొదటిపేజీ తరువాయి -** తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.వివరాల్లోకి వెళితే... జిల్లాలో ఇటీవల కొందరికి అనుమానంతో చేసిన ఆర్టీపీసీఆర్ పరీక్షల్లో ఐదుగురికి కరోనా పాజిటివ్‌గా నిర్ధారణ అయింది. ఇదిలా ఉండగా, కడప నగరంతో పాటు రాజంపేట ప్రాంతానికి చెందిన ఇద్దరు వ్యక్తులు తీవ్రమైన కరోనా లక్షణాలతో బాధపడుతూ, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించారు.ఒకేసారి ఇద్దరు ప్రాణాలు కోల్పోవడంతో అప్రమత్తమైన ఆరోగ్య శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగారు. కడప, రాజంపేటల్లోని బాధిత ప్రాంతాలలో స్పెషల్ మెడికల్ టీమ్స్ పర్యటిస్తున్నాయి. మృతుల కుటుంబ సభ్యులతో పాటు, వారితో ప్రాథమికంగా పరిచయం ఉన్నవారి (ప్రైమరీ కాంటాక్ట్) వివరాలను సేకరిస్తున్నారు. స్థానికంగా ఎవరికైనా జ్వరం, దగ్గు, శ్వాసకోస సమస్యలు ఉన్నాయా అనే అంశంపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.మరణానికి గల కచ్చితమైన కారణాలు, వైరస్ యొక్క కొత్త వేరియంట్ ఏమైనా ఉందా అనే కోణాన్ని నిర్ధారించుకోవడానికి బాధితుల నమూనాలను సేకరించి, పూణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ ల్యాబ్‌కు పంపించారు. అయితే, జిల్లాలో కరోనా వైరస్ వ్యాప్తి, ఈ మరణాలపై వైద్య ఆరోగ్య శాఖ ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. అధికారులు అధికారికంగా నిర్ధారించే వరకు ప్రజలు భయాందోళనలకు గురికాకుండా, అవసరమైన జాగ్రత్తలు పాటించాలని నిపుణులు సూచిస్తున్నారు.

## అమర్‌నాథ్ యాత్రకు పోటెత్తిన భక్తులు

**మొదటిపేజీ తరువాయి -** మంది పురుషులు, 2,042 మంది మహిళలు, 228 మంది సాధువులు, 10 మంది చిన్నారులు, 33 మంది విదేశీయులతో పాటు ఒక ట్రాన్స్‌జెండర్ కూడా ఉన్నారు. మొత్తం 354 వాహనాల్లో వీరిని తరలించారు.నిన్న లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా శ్రీనగర్ శివార్లలోని పంథా చౌక్ యాత్రి శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "గత ఏడాదితో పోలిస్తే ఈసారి యాత్రికుల సంఖ్య గణనీయంగా పెరిగింది. ఇది జమ్మూకశ్మీర్ పర్యాటకానికి, స్థానిక ఆర్థిక వ్యవస్థకు కొత్త ఊపునిస్తుంది" అని అన్నారు. యాత్రికులు జమ్మూకశ్మీర్ చేతివృత్తులు, చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, ఇక్కడి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఇది 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' స్ఫూర్తిని బలపరుస్తుందని పేర్కొన్నారు.మరోవైపు యాత్రికులకు నకిలీ రిజిస్ట్రేషన్లు చేసి డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలపై నలుగురు స్థానిక ఉపాధ్యాయులను అధికారులు సస్పెండ్ చేసి, అదుపులోకి తీసుకున్నారు. గందర్‌బల్ జిల్లాలోని మణిగామ్ ట్రాన్సిట్ క్యాంపులో ఈ ఘటన చోటుచేసుకుంది. ఇలాంటి మోసపూరిత చర్యలకు పాల్పడే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మనోజ్ సిన్హా అధికారులను ఆదేశించారు. అన్ని యాత్రా శిబిరాల వద్ద నిఘా పెంచినట్లు తెలిపారు.ఈ నెల 3న ప్రారంభమైన ఈ యాత్ర 56 రోజుల పాటు కొనసాగి, శ్రావణ పౌర్ణమి, రక్షాబంధన్ పర్వదినమైన ఆగస్టు 28న ముగుస్తుంది. భక్తులు హిమాలయాల్లో 3,880 మీటర్ల ఎత్తులో ఉన్న పవిత్ర గుహకు సంప్రదాయ పహల్గామ్ మార్గం లేదా తక్కువ దూరం ఉండే బల్తాల్ మార్గం ద్వారా చేరుకుంటారు.

# భద్రాద్రి రామయ్య మీద ఒట్టు మళ్లీ మాదే అధికారం

**మొదటిపేజీ తరువాయి -** కుటుంబాన్ని మళ్లీ ఓడించే వరకు విశ్రమించనని స్పష్టం చేశారు. ఖమ్మం జిల్లా చింతకాని మండలం జగన్నాథపురంలో రైతు ఆశీర్వాద సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి, రైతు భరోసా నిధులను విడుదల చేసిన అనంతరం మాట్లాడారు.సభకు వచ్చిన ప్రజలను చూస్తుంటే తన గుండె పులకిస్తోందన్న సీఎం, రాజకీయంగా తనకు పాలమూరు ప్రాణమని, తన రాజకీయ ఎదుగుదలలో ఖమ్మం గుండెకాయగా పని చేసిందని తెలిపారు. గత ఎన్నికల సమయంలో కేసీఆర్ మాయమాటలు, మూటలతో ఎన్నికలకు వస్తున్నారని, వారిని ఎలా ఎదుర్కోగలరని కొందరు తనను ప్రశ్నించారని గుర్తు చేశారు. వాళ్లు ఎలా వచ్చినా కాంగ్రెస్ 65 సీట్లు గెలుస్తుందని ఆనాడే చెప్పానని, ఎన్నికల్లో తమ పార్టీకి 64 సీట్లు వచ్చాయని స్పష్టం చేశారు. ఉప ఎన్నికల్లో మరో రెండు సీట్లు వచ్చాయన్నారు. బీఆర్ఎస్‌కు లోక్‌సభ ఎన్నికల్లో సున్నా సీట్లు వస్తాయని చేవెళ్ల సభలో చెప్పానని, చేవెళ్ల సభలో చెప్పినట్లే బీఆర్ఎస్‌కు గుండు సున్నా సీట్లు వచ్చాయని తెలిపారు. అన్ని ఎన్నికల్లోనూ తాను చెప్పినట్లుగానే ప్రజలు తీర్పు ఇచ్చారన్న ఆయన, అన్ని ఎన్నికల్లో ఓడించి పాపాల భైరవుడిని ఫామ్‌హౌస్‌కు పరిమితం చేశామని అన్నారు. కౌరవ వంశాన్ని (కల్వకుంట్ల కుటుంబం) తెలంగాణ గడ్డ మీద నుంచి తొలగిస్తామని, కల్వకుంట్ల కుటుంబాన్ని రాజకీయంగా అణగ దొక్కేవరకు విశ్రాంతి తీసుకోనని స్పష్టం చేశారు.వచ్చే పార్లమెంట్ సమావేశాల్లో డీ లిమిటేషన్ బిల్లు ఆమోదించుకునేందుకు బీజేపీ ప్రయత్నిస్తోంది. వచ్చే శాసనసభ ఎన్నికలు 2028 డిసెంబర్‌లో జరగవు. 2029 మే, జూన్‌లో జరుగుతాయి. అసెంబ్లీ సీట్లు 119 నుంచి 182కు, ఎంపీ సీట్లు 17 నుంచి 26కు పెరుగుతాయి. వచ్చే ఎన్నికల్లో 117 సీట్లు గెలిచి మళ్లీ అధికారంలోకి వస్తాం. 117 సీట్లు గెలుస్తామని భద్రాచలం రాముడి మీద ఆన.నాడు వరి వేస్తే ఉరే అని కేసీఆర్ అన్నారని, నేడు వరి వస్తే కొనుగోలు చేసి బోనస్ ఇస్తున్నామని రేవంత్ రెడ్డి అన్నారు. రైతును రాజు చేయాలని మంత్రి తుమ్మల ప్రయత్నిస్తున్నారని, ప్రభుత్వం వచ్చిన రెండున్నరేళ్లలో రైతులకు రూ.1.70 లక్షల కోట్లు ఖర్చు పెట్టామని పేర్కొన్నారు. కాంగ్రెస్ వస్తే కరెంట్ ఉండదని అసత్యాలు చెప్పారని, కేసీఆర్ ఇప్పుడు కరెంట్ తీగలు పట్టుకో కాకిలా మాడిపోతావని ఎద్దేవా చేశారు. ఉచిత కరెంట్ కాంగ్రెస్ పేటెంట్ రైట్ అని వెల్లడించారు. రైతుల కళ్లలో ఆనందం చూడటమే తమ లక్ష్యమని, కల్వకుంట్ల కుటుంబంలోనే కుట్రలు, కుతంత్రాలు ఉన్నాయని, వారి కుటుంబంలో ఒకరిని చూస్తే ఒకరికి నచ్చదని విమర్శించారు. మేడిగడ్డలో నీళ్లు నింపాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారని, ఒకవేళ మేడిగడ్డలో నీళ్లు నింపితే భద్రాచలం మునుగుతుందని ముఖ్యమంత్రి తెలిపారు. రాజకీయాల కోసం భద్రాచలం రాముడు మునగాలా అని ప్రశ్నించారు. హరీశ్‌రావు బీజేపీ నేతలతో రాత్రి మంతనాలు చేస్తున్నారని ఆరోపించిన సీఎం, బీజేపీతో మంతనాలు చేయట్లేదని హరీశ్‌రావు ప్రమాణం చేస్తారా అని సవాల్ విసిరారు. తాటిచెట్టంత పెరిగిన ఆయనకు బుర్రలో గుజ్జు లేదని ఎద్దేవా చేశారు."బీఆర్ఎస్‌ను బీజేపీలో విలీనం చేస్తారని ఆయన చెల్లెలే చెబుతున్నారు. ఆంధ్రా కాంట్రాక్టర్ల నుంచి ఆయన డబ్బులు తీసుకున్నారని చెల్లెలే చెప్పారు. ప్రజలకు ఉపయోగపడే ఏ పథకాన్ని రద్దు చేయలేదు. నిరుద్యోగుల కలను కేసీఆర్ నెరవేర్చ లేదు. మా ప్రభుత్వం వచ్చిన ఏడాదిలోనే 67 వేల ఉద్యోగాలు భర్తీ చేశాం. ఆడబిడ్డలకు చీరల పంపిణీ చేసేందుకూ వాళ్లు కమీషన్లు తీసుకున్నారు. రాష్ట్రం అప్పుల ఊబిలో ఉన్నా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాం. భట్టి కోరిక మేరకు మధిరకు ఇంజినీరింగ్ కాలేజీ మంజూరు చేస్తున్నా. 20 ఎంపీ సీట్లు గెలిచి కాంగ్రెస్ అధిష్ఠానానికి బహుమతి ఇస్తాం. 5 లక్షల మందితో త్వరలో రాహుల్‌గాంధీతో ఖమ్మంలో సభ పెడతామన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి.

# కాళేశ్వరం ప్రాజెక్టు మొత్తాన్ని తప్పుబట్టడం సరికాదు

**మొదటిపేజీ తరువాయి -** సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని తీవ్రంగా రాష్ట్రాల్లో భారీ వర్షాలతో తెలంగాణ ప్రాజెక్టుల్లోకి నీరు వస్తున్నప్పటికీ ప్రభుత్వం మోటార్లు ఆన్ చేయకుండా రైతులను ఇబ్బందులకు గురిచేస్తోందని ఈటల ఆరోపించారు. వర్షాకాలంలోనూ సాగునీరు అందక రైతులు కష్టాలు పడుతున్నారని, ముఖ్యంగా ఎస్ఆర్ఎస్పీ కాల్వల కింద బోర్లు, బావులు లేకుండా వ్యవసాయం చేయడం సాధ్యం కాదని చెప్పారు.తెలంగాణ ఉద్యమం నీళ్లు, నిధులు, ఆత్మగౌరవం కోసమే జరిగిందని ఈటల గుర్తుచేశారు. రాజకీయాలు, సిద్ధాంతాలు వేరైనా మూలాలను మరచిపోవద్దన్నారు. కాళేశ్వరం కంటే ముందే వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో జలయజ్ఞం ద్వారా ప్రాణహిత జలాలను తీసుకురావాలనే ప్రణాళిక రూపొందిందని, శ్రీపాద ఎల్లంపల్లి, మిడ్ మానేరు వంటి ప్రాజెక్టులకు అప్పుడే శ్రీకారం చుట్టారని వివరించారు.స్వరాష్ట్రం ఏర్పడిన తర్వాత మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టును అభివృద్ధి చేసి ఎల్లంపల్లికి నీటిని తరలించే వ్యవస్థ ఏర్పాటు చేశారని చెప్పారు. ప్రస్తుతం మిడ్ మానేరు ప్రాజెక్టులో ఉన్న 29 టీఎంసీల నీరు కూడా ఆ ప్రాజెక్టుల ద్వారానే వచ్చిందన్నారు. కాళేశ్వరం వల్లే హుజూరాబాద్‌తో పాటు కరీంనగర్, వరంగల్, నల్గొండ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో రెండు పంటలు సాధ్యమయ్యాయని పేర్కొన్నారు.కాళేశ్వరం ప్రాజెక్టులో కమీషన్లు, డిజైన్ మార్పులపై



తాను మాట్లాడడం లేదని, కానీ మొత్తం ప్రాజెక్టునే తప్పుపట్టడం సరికాదని కాంగ్రెస్ నేతలపై మండిపడ్డారు. ప్రాజెక్టు పరిధిలోని దెబ్బతిన్న నిర్మాణాలకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని, లేకపోతే రాష్ట్రం తీవ్ర కరవును ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

# మానసిక, శారీరక దృఢత్వాన్ని క్రీడల వల్ల సాధించవచ్చు

**జిల్లా ఎస్పి అశోక్ కుమార్**

**పోలీసులకు వార్షిక క్రీడలు ఉల్లాసాన్ని కలిగిస్తాయి**

**అట్టహాసంగా ప్రారంభమైన 4వ వార్షిక జిల్లా పోలీసు క్రీడలు**

**రెండు రోజుల పాటు కొనసాగనున్న క్రీడా పోటీలు**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, (ప్రజా మంటలు) జులై 10:** క్రీడలతో స్నేహ భావం పొందడంతో పాటు పని ఒత్తిడి నుండి రిలీఫ్ అవడానికి క్రీడలు ఎంతో దోహద పడుతాయని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ తెలిపారు. అనునిత్యం విధులలో, నిరంతరం పనిలో నిమగ్నమైన జిల్లా పోలీసులకు ఆటవిడుపుగా జిల్లా పోలీసు వార్షిక క్రీడలు నిర్వహించడం జరిగిందని అన్నారు. శుక్రవారం ఉదయం స్థానిక పోలీస్ హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానం నందు జిల్లా ఎస్పీ పాల్గొని పోలీసు క్రీడలను ప్రారంభించారు. మొదటగా క్రీడలను ప్రారంభిస్తున్నట్లు జిల్లా ఎస్పి తెలిపారు. తదుపరి పరేడ్ మైదానం పరేడ్ ను నిర్వహించి ముఖ్య అతిథులకు గౌరవ వందనాన్ని అందజేయడం జరిగింది. తదుపరి స్పోర్ట్స్ జెండాను అధికారుల సమక్షంలో ఎస్పి ఆవిష్కరించడం జరిగింది. స్పోర్ట్స్ ప్రారంభమైనట్లు



తెలియజేస్తున్నటువంటి బెలూన్లను గాలిలోకి వదిలి జిల్లా పోలీసు వార్షిక క్రీడలను ప్రారంభించి క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం క్రీడాకారులచే ఎలాంటి రాగద్వేషాలు లేకుండా నిష్పక్షపాతంగా క్రీడలను ఆడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పి మాట్లాడుతూ... మొదటగా క్రీడా పోటీలలో పాల్గొననున్న క్రీడాకారులందరికీ అభినందనలు తెలియజేస్తూ, క్రీడలు ఆడే స్ఫూర్తి గొప్పదని ప్రతి ఒక్కరూ క్రీడలను ఆడుతూ మానసిక శారీరక దృఢత్వాన్ని కాపాడుకోవాలని తెలియజేశారు. ఇలాంటి క్రీడా పోటీల లోనే ప్రతి ఒక్కరి ప్రతిభ కనబడుతుందని తెలియజేశారు. క్రీడలలో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తితో పోటీలలో పాల్గొనవలసిందిగా తెలియజేశారు. ప్రతిరోజు విధులు నిర్వహించే అధికారులకు, సిబ్బందికి ఆటవిడుపుగా ఇలాంటి క్రీడా పోటీలు నిర్వహిస్తారని వాటిలో ప్రతి ఒక్కరూ పాల్గొని మానసిక ఉల్లాసాన్ని పొందవలసిందిగా తెలిపారు. ఇలాంటి క్రీడా పోటీల్లో పాల్గొనడం వల్ల ఉద్యోగుల మధ్య సఖ్యత పెరిగి, విధులలో కలిసిమెలిసి పనిచేస్తూ ఉండడం జరుగుతుందని తెలిపారు. తదుపరి రన్నింగ్, వాలీబాల్ క్రికెట్ క్రీడలను జిల్లా ఎస్పీ ఆడి క్రీడాకారులను ప్రోత్సహించి ఉత్సాహపరిచారు. ముఖ్యంగా ఈ క్రీడలు రెండు రోజులపాటు నిర్వహించనున్నట్లు అందులో వాలీబాల్, క్రికెట్, కబడ్డీ, బ్యాట్మెంటన్, అథ్లెటిక్స్, క్యారం, చెస్ లాంటి వివిధ అంశాలలో ఈ క్రీడలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్, డీఎస్పీ పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు ఆరిఫ్ అలీ ఖాన్, సుధాకర్, కరుణాకర్, రాజకుమార్, లక్ష్మీనారాయణ, కిరణ్ కుమార్, సైదులు, వేణు, ఎస్.ఐ లు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# వికసిత్ భారత్‌కు గుర్తింపు

**నషా ముక్త్ భారత్ అభియాన్ విజయ వంతం కావాలి**

**సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి, / ధర్మపురి ( ప్రజా మంటలు) జూలై 10:** మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణమే దేశ అభివృద్ధికి బలమైన పునాదిగా నిలుస్తుందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ధర్మపురి యందుశుక్రవారం మిషన్ పరివర్తన్ ఆధ్వర్యంలో నిర్వహించిన “నషా ముక్త్ భారత్ అభియాన్ -- వికసిత్ భారత్ కి పహచాన్” కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్, జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ లతో కలిసి రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూదేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందన్నారు. యువత ఆరోగ్యవంతంగా, బాధ్యతాయుతంగా ఎదిగితేనే వికసిత్ భారత్ లక్ష్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే మహమ్మారిగా మారుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి క్రీడలు, విద్య, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలపై యువత దృష్టి సారించాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను గమనిస్తూ వారితో స్నేహ పూర్వకంగా మెలగాలని కోరారు. పాఠశాలలు, కళాశాలలు మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. ప్రతి గ్రామం, ప్రతి వార్డు, ప్రతి విద్యాసంస్థ డ్రగ్స్ రహిత ప్రాంతంగా మారేందుకు అందరూ కలిసి పనిచేయాలని పిలుపునిచ్చారు. మాదకద్రవ్యాల వినియోగాన్ని సామాజిక సమస్యగా భావించి సమిష్టిగా ఎదుర్కోవాలని మంత్రి అన్నారు. ప్రభుత్వం చేపడుతున్న నషా ముక్త్ భారత్ అభియాన్‌కు ప్రజలు పూర్తి సహకారం అందించాలని కోరారు. యువత తమ జీవిత లక్ష్యాలను సాధించేందుకు మంచి అలవాట్లు పెంపొందించుకోవాలని సూచించారు. వ్యసనాలకు బానిస కాకుండా ఆరోగ్యవంతమైన జీవన విధానాన్ని అలవర్చుకోవాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మాట్లాడుతూ... మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రభుత్వం అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతోందన్నారు. యువతలో చైతన్యం పెంపొందించడం ద్వారా డ్రగ్స్ వినియోగాన్ని గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు కలిసి యువతను సరైన దారిలో నడిపించాలని సూచించారు. విద్యార్థులు తమ లక్ష్యాలపై దృష్టి సారించి మాదకద్రవ్యాలకు పూర్తిగా దూరంగా ఉండాలని అన్నారు. ప్రతి విద్యాసంస్థలో డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహిస్తామని చెప్పారు. స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణంలో ప్రతి పౌరుడి బాధ్యత ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ... డ్రగ్స్ వల్ల వ్యక్తి మాత్రమే కాదు కుటుంబం, సమాజం కూడా తీవ్రంగా నష్టపోతుందని అన్నారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ కఠిన చర్యలు తీసుకుంటోందని తెలిపారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే పోలీసులకు తెలియజేయాలని ప్రజలను కోరారు. సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండేందుకు పోలీసులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు



తెలిపారు. చట్టవ్యతిరేకంగా డ్రగ్స్ విక్రయించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించారు. డ్రగ్స్ వినియోగం వల్ల ఆరోగ్యం, విద్య, ఉపాధి, కుటుంబ జీవితం తీవ్రంగా దెబ్బతింటుందని వివరించారు. సమాజంలో ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో అవగాహన పెంచేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. డ్రగ్స్ రహిత జిల్లా నిర్మాణానికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. అనంతరం మాదకద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లు, సందేశాలు ప్రదర్శించారు. విద్యార్థులు, యువత ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొని డ్రగ్స్‌కు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ చేతన్ నితిన్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ సంగన భట్ల దినేష్, జిల్లా సంక్షేమ శాఖ అధికారి (డిడబ్ల్యుఓ) భాస్కర్, వివిధ శాఖల జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# కరీంనగరంలో సరికొత్త వస్త్ర ప్రపంచం

**వైభవంగా ‘జీఎస్ఆర్ ఫ్యాబ్రిక్ హౌస్’ ప్రారంభోత్సవం**

**కరీంనగర్, జూలై 10 (ప్రజా మంటలు):** ఉమ్మడి కరీంనగర్ జిల్లా వస్త్ర ప్రియుల మనసు దోచేందుకు సరికొత్త అంతర్జాతీయ హంగులతో మరో భారీ షాపింగ్ ప్రపంచం అందుబాటులోకి వచ్చింది. నగరంలోనే అత్యంత ప్రముఖమైన సివిఆర్ఎన్ రోడ్డులోని వన్ హాస్పిటల్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన ప్రముఖ మల్టీబ్రాండ్ సూటింగ్, షర్టింగ్ వస్త్రాలయం ‘జీఎస్ఆర్ ఫ్యాబ్రిక్ హౌస్’ (+ూ= ఖీూదీ=×జ ఆూఖూజు) గ్రాండ్ లాంచ్ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. కరీంనగర్ నగర నడిబొడ్డున వెలిసిన ఈ సరికొత్త షోరూమ్ ప్రారంభోత్సవ వేడుకకు రాజకీయ, వ్యాపార, సామాజిక రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు భారీ సంఖ్యలో తరలివచ్చి సందడి చేశారు. ఈ సరికొత్త వస్త్ర ప్రపంచాన్ని కరీంనగర్ నియోజకవర్గ శాసనసభ్యులు, మాజీ మంత్రి గంగుల కమలాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి ముఖ్య అతిథులుగా హాజరై, ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గంగుల కమలాకర్ మాట్లాడుతూ... మారుతున్న కాలానికి అనుగుణంగా కరీంనగర్ నగరం అన్ని రంగాల్లో శరవేగంగా దూసుకుపోతోందని, ఇప్పుడు జాతీయ, అంతర్జాతీయ బ్రాండెడ్ వస్త్రాలు స్థానికంగానే లభించడం నగర ప్రజలకు ఎంతో శుభపరిణామమని అభినందించారు. అత్యాధునిక కలెక్షన్లతో కస్టమర్ల నమ్మకాన్ని చూరగొంటూ ఈ సంస్థ వ్యాపార రంగంలో మరింత ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఈ మెగా ప్రారంభోత్సవ వేడుకలో డిప్యూటీ మేయర్ వై సునీల్ రావు ,ఆల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు డాక్టర్ వి. నరేందర్ రెడ్డి, 52వ డివిజన్ కార్పొరేటర్లు సరిల్ల ప్రసాద్ -- రాజకుమారి, వంగల పవన్, పిట్టల శ్రీనివాస్, అంజనీ ప్రసాద్, ఏపీపీ చంద్ర (టింకూ) లతో పాటు నగరంలోని ప్రముఖ వ్యాపారవేత్తలు, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొని నిర్వాహకులకు ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం జీఎస్ఆర్ ఫ్యాబ్రిక్ హౌస్ నిర్వాహకులు దౌలగర్ సుధాకర్ రావు, అంబేకర్ గోపాల్, మాలత్కర్ రాజు, మాలత్కర్ దీపికలు సంయుక్తంగా మాట్లాడుతూ, కరీంనగర్ ప్రజలకు సరికొత్త షాపింగ్ అనుభూతిని అందించాలనే సంకల్పంతో ఈ షోరూమ్‌ను తీర్చిదిద్దినట్లు పేర్కొన్నారు. దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మకమైన, ప్రముఖ బ్రాండ్లు అయిన లినెన్ క్లబ్,



రేమండ్, ది అరవింద్, మరియు సియారామ్స్ వంటి టాప్ బ్రాండెడ్ సూటింగ్, షర్టింగ్ కలెక్షన్లన్నింటినీ ఒకే సూరకప్పు కిందకు తీసుకువచ్చామని వివరించారు. పెళ్లిళ్లు, పండుగలు, శుభకార్యాలతో పాటు అన్ని వర్గాల కస్టమర్ల అభిరుచులకు తగినట్లుగా హోల్‌సేల్ ధరలకే నాణ్యమైన వస్త్రాలను అందిస్తున్నామని, కలెక్షన్ల వివరాలు లేదా ఇతర సమాచారం కోసం భక్తులు, వినియోగదారులు 88019 47555, 98487 86840 నంబర్లలో సంప్రదించవచ్చని వారు ఈ సందర్భంగా వెల్లడించారు.

# కేవి కి 5ఎకరాల కేటాయింపు బీజేపీ పోరాట ఫలితమే

**ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం**

**మరో 5 ఎకరాలు స్థలం కోసం ఉద్యమిస్తాం**

**విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం కొనసాగుతుంది**

**బీజేపీ నియోజకవర్గ ఇంచార్జి డాక్టర్ భోగ శ్రావణి**

**జగిత్యాల జిల్లా ప్రతినిధి ( ప్రజా మంటలు), జులై 10:** జగిత్యాలలో కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరీ సెంటర్‌లో ఐదు ఎకరాల భూమిని కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నెం.158ను బీజేపీ స్వాగతిస్తున్నట్లు జగిత్యాల నియోజకవర్గ ఇన్‌చార్జ్ డా. భోగ శ్రావణి తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తు, ధర్మం, న్యాయం కోసం బీజేపీ చేసిన పోరాటానికి దక్కిన ఫలితమే ఈ నిర్ణయమని అన్నారు. శుక్రవారం కమల నిలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో శ్రావణి మాట్లాడుతూ.. కేంద్రీయ విద్యాలయ ఏర్పాటుకు చల్‌గల్ వాలంతరి సెంటర్ ప్రాంతమే అనుకూలమని కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారులు గుర్తించారని అన్నారు. అభివృద్ధి కోసమే పార్టీ మారానని చెబుతున్న ఎమ్మెల్యే సంజయ్ కుమార్ కారణంగానే సంవత్సరం



కాలయాపన జరిగిందని పేర్కొన్నారు. ఎమ్మెల్యే సంజయ్ కుమార్ స్వార్థపూరితంగా తనకు భూములు ఉన్న చోట కెవి ఏర్పాటు కు స్థలాలు ప్రపోజ్ చేస్తే స్థల పరిశీలనకు వచ్చిన అధికారులు వాటిని తిరస్కరించినట్లు గుర్తు చేశారు. కేంద్రీయ విద్యాలయాన్ని చల్‌గల్ లోనే ఏర్పాటు చేయాలని ఎంపీ ధర్మపురి అరవింద్ చేపట్టిన నిరాహార దీక్షను ఎమ్మెల్యే పోలీసులతో అడ్డుకోవడమే కాకుండా బీజేపీ మహిళా నాయకులని కూడా చూడకుండా అరెస్టు చేసి చేయించి లాక్కెల్లేలా చేసారని ఆరోపించారు. అయితే చివరికి బీజేపీ నాయకుల పోరాట ఫలితంగా విద్యార్థుల ప్రయోజనాలే గెలిచాయని వ్యాఖ్యానించారు. కాగా ప్రభుత్వం ఐదు ఎకరాల భూమిని కేటాయించడం స్వాగతించదగ్గ నిర్ణయమే అయినప్పటికీ, పూర్తి స్థాయి కేంద్రీయ విద్యాలయానికి 10 ఎకరాల స్థలం అవసరమని శ్రావణి అభిప్రాయపడ్డారు. క్రీడా మైదానం, కమ్యూనికేషన్ స్కిల్స్, ఇతర మౌలిక వసతుల కోసం అదనంగా మరో ఐదు ఎకరాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇందుకోసం బీజేపీ ఆధ్వర్యంలో ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. జూలై 12న ఎంపీ ధర్మపురి అరవింద్ ఆధ్వర్యంలో కేవీ ఏర్పాటు కు భూమిపూజ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. కేంద్రీయ విద్యాలయం మంజూరుకు కృషి చేసిన ఎంపీ అరవింద్‌తో పాటు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని భూమి కేటాయింపుకు సహకరించిన జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్‌కు పార్టీ నాయకులు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు. అలాగే తమ పోరాటాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లిన మీడియాకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు మ్యాదరి అశోక్, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు దూరిశెట్టి మమత,42వ వార్డ్ కౌన్సిలర్ నిమ్మల నాగరాజు, జిల్లా కార్యదర్శులు పాత రమేష్, ముత్యంరెడ్డి, కాశెట్టి తిరుపతి,పూదరి శ్రీనివాస్, బద్దెల గంగరాజం, తదితరులు పాల్గొన్నారు.

# ముల్కనూర్ సహకార సంఘానికి జాతీయ స్థాయి ప్రతిష్టాత్మక “ఫార్మర్-సెంట్రిక్ ఇంపాక్ట్ ఎక్సెలెన్స్” అవార్డు

**భీమదేవరపల్లి జూలై 10:** గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు, సహకార రంగానికి ఆదర్శంగా నిలిచిన ముల్కనూర్ కోఆపరేటివ్ రూరల్ క్రెడిట్ ఒ మార్కెటింగ్ సొసైటీ మరో అంతర్జాతీయ, జాతీయ స్థాయి అరుదైన గుర్తింపును సొంతం చేసుకుంది. అసోసియేటెడ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఆఫ్ ఇండియా నిర్వహించిన ‘ఇండియా సీడ్ ట్రేడ్ ఒ ఇన్నోవేషన్ సమ్మిట్ 2026’ లో ముల్కనూర్ సహకార సంఘానికి ప్రతిష్టాత్మకమైన “ఫార్మర్-సెంట్రిక్ ఇంపాక్ట్ ఎక్సెలెన్స్” అవార్డు లభించింది. హైదరాబాద్‌లోని ఇక్రిసాట్ వేదికగా జరిగిన ఈ సదస్సులో... ప్రపంచ విత్తన వాణిజ్యం, ఆవిష్కరణలు సుస్థిర వ్యవసాయ రంగాల్లో విశేష కృషి చేసినందుకు గాను ఈ పురస్కారాన్ని ప్రకటించారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ విత్తన కంపెనీలు, వ్యవసాయ సంస్థల ప్రతినిధులు, పరిశ్రమ నిపుణుల సమక్షంలో,ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ చేతుల మీదుగా ఈ అవార్డును అందజేశారు. ముల్కనూర్ సహకార సంఘం తరపున జనరల్ మేనేజర్ మారుపాటి రాం రెడ్డి అందుకున్నారు. విత్తన ఉత్పత్తి కార్యక్రమాల ద్వారా రైతుల ఆర్థిక స్థితిగతులను మార్చడంలో ముల్కనూర్ కీలక పాత్ర పోషించింది. తెలంగాణ వ్యాప్తంగా నాణ్యమైన వరి విత్తనాల ఉత్పత్తి, శుద్ధి విక్రయాలను విజయవంతంగా నిర్వహించడం ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచింది. ఈ వినూత్న విధానం ద్వారా రైతు-సభ్యులకు నాణ్యత భరోసా, మెరుగైన మార్కెట్ అవకాశాలు, గరిష్ట రాబడిని కల్పించింది. అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డిముల్కనూర్ సహకార సంఘం సేవలకు జాతీయ వేదికపై ఇంతటి ప్రతిష్టాత్మక గుర్తింపు లభించడం పట్ల అధ్యక్షుడు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... “ఈ గౌరవం ముల్కనూర్ సంఘం సాధించిన నిరంతర విజయానికి ప్రతిరూపం.



రైతు సంక్షేమం పట్ల అంకితభావంతో పనిచేసిన మన రైతు-సభ్యులు, ఉద్యోగులు, భాగస్వామ్య వర్గాలందరి కష్టానికి దక్కిన ఫలితం ఇది” అని పేర్కొంటూ ఈ అవార్డును వారికే అంకితం చేశారు.

# జర్నలిస్టులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించాలి

**హనుమకొండ డిపో మేనేజర్‌కు టీడబ్ల్యూజేఎఫ్ వినతి**



**భీమదేవరపల్లి జూలై 10:** రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జర్నలిస్టులందరికీ ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. టీడబ్ల్యూజేఎఫ్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిపో మేనేజర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్ డబ్ల్యూజె జాతీయ కౌన్సిల్ సభ్యులు చుంచు ఐలయ్య మాట్లాడుతూ: మండల జర్నలిస్టులకు జిల్లా వ్యాప్తంగా ఉచిత ప్రయాణం ఉండి, ఇతర జిల్లాలకు లేకపోవడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అలాగే జిల్లా జర్నలిస్టులకు రాష్ట్రవ్యాప్తంగా మూడో వంతు (1/3) రాయితీ మాత్రమే ఉండటంతో ఆర్థికంగా భారం పడుతోందన్నారు. ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా పనిచేస్తున్న జర్నలిస్టులందరికీ, మహిళల తరహాలోనే రాష్ట్రవ్యాప్తంగా ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పించాలి. ఇతర రాష్ట్రాలకు వెళ్లే ఆర్టీసీ బస్సుల్లో జర్నలిస్టులకు 1/3 వంతు ఛార్జీలకే ప్రయాణించే అవకాశం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా కన్వీనర్ సాతూరి చంద్రమౌళి, ముఖ్య నాయకులు రాంపల్లి శ్రీనివాస్, బొలిశెట్టి అశోక్, బొల్లంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# మెట్‌పల్లి కోర్టుకు నూతన భవనం నిర్మించాలని హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్‌కు వినతి



**మెట్‌పల్లి, జూలై 10 (ప్రజా మంటలు):** మెట్‌పల్లి కోర్టు ఆవరణలో నూతనంగా ఐదు కోర్టుల భవనాల నిర్మాణానికి చర్యలు చేపట్టాలని కోరుతూ మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ప్రతినిధులు శుక్రవారం హైకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఎస్. గోవర్ధన్ రెడ్డిని కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఏలేటి రామ్‌రెడ్డి మాట్లాడుతూ, ప్రస్తుతం మెట్‌పల్లి కోర్టు భవనం శిథిలావస్థకు చేరుకుందని, న్యాయసేవల నిర్వహణకు అనుకూలంగా ఆధునిక సౌకర్యాలతో కూడిన కొత్త కోర్టు భవనం నిర్మించాలని కోరినట్లు తెలిపారుఅలాగే ప్రతిపాదిత ఐదు కోర్టుల భవనాలతో పాటు బార్ అసోసియేషన్ కార్యాలయ గది, మండల్ లీగల్ సర్వీసెస్ అథారిటీ కార్యాలయం, మీడియేషన్ సెంటర్, క్లయింట్ల కోసం ప్రత్యేక వేచివుండే గది (వెయిటింగ్ హాల్) నిర్మాణాన్ని కూడా ప్రణాళికలో చేర్చాలని విజ్ఞప్తి చేసినట్లు చెప్పారు. ప్రస్తుతం కోర్టుకు ఆనుకుని ఉన్న 38 గుంటల ఎస్సారెస్పీ ఖాళీ స్థలాన్ని కోర్టు అవసరాల కోసం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కూడా రిజిస్ట్రార్ జనరల్‌ను కోరినట్లు వెల్లడించారు. అనంతరం బార్ కౌన్సిల్ చైర్మన్ ఎ. నర్సింహారెడ్డి, రాష్ట్ర న్యాయశాఖ కార్యదర్శి పాపిరెడ్డిని కలిసి కోర్టుల మౌలిక వసతులు, న్యాయవాదులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నూతన బార్ కౌన్సిల్ సభ్యుడు అనంత సేనారెడ్డి, హైకోర్టు న్యాయవాదులు అల్లూరి దివాకర్ రెడ్డి, ఎ. వినయ్, మెట్‌పల్లి బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నల్ల రాజేందర్, చెర్లపల్లి ఆనంద్ గౌడ్, ఒజ్జల శ్రీనివాస్, బిగుల్లా శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ తో ముల్కనూర్ సహకార సంఘం అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి భేటీ



**భీమదేవరపల్లి జూలై 10:** ముల్కనూర్ సహకార గ్రామీణ పరపతి మార్కెటింగ్ సొసైటీ లిమిటెడ్ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి శుక్రవారం భారతీయ స్టేట్ బ్యాంక్ వ్యవసాయ వ్యాపార విభాగం ప్రభుత్వ ప్రాయోజిత పథకాల చీఫ్ మేనేజర్ గోవింద్ నారాయణ్ గోయల్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సమావేశంలో ఎస్‌బీఐ – ముల్కనూర్ సంఘం మధ్య దశాబ్దాలుగా కొనసాగుతున్న భాగస్వామ్యం, రైతులకు అందుతున్న సేవలు, భవిష్యత్ సహకార అవకాశాలపై వారు విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా ముల్కనూర్ సహకార సంఘం గత 70 సంవత్సరాలుగా రైతులకు అందిస్తున్న సమగ్ర సేవలను అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి వివరించారు. వ్యవసాయ రుణాలు,పొదుపు సేవలు, పంటల కొనుగోలు, నాణ్యమైన విత్తనాల ఉత్పత్తి–పంపిణీ, ఎరువుల సరఫరా, గిడ్డంగుల సదుపాయాలు, పాల ఉత్పత్తి అభివృద్ధి, మహిళా సాధికారతతో పాటు సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, పారదర్శక పాలన వంటి అంశాలను సీజీఎం దృష్టికి తీసుకెళ్లారు. ముల్కనూర్ సహకార సంఘం దేశ సహకార రంగానికే ఆదర్శంగా నిలవడం అభినందనీయమని ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ గోవింద్ నారాయణ్ గోయల్ కొనియాడారు. ముఖ్యంగా ముల్కనూర్ పరిధిలోని రైతులు రుణాల చెల్లింపులో ప్రదర్శిస్తున్న అత్యుత్తమ క్రమశిక్షణ (రీ పేమెంట్ ) ఎస్‌బీఐకి ఎంతో విశ్వాసాన్ని కలిగించిందని, రైతులు–సహకార సంఘం–బ్యాంకు మధ్య ఉన్న ఈ పరస్పర నమ్మకం దేశవ్యాప్తంగా ఒక గొప్ప నమూనాగా నిలుస్తుందని ఆయన ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ముల్కనూర్ సహకార సంఘంతో ఎస్‌బీఐ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తామని గోవింద్ నారాయణ్ గోయల్ హామీ ఇచ్చారు. వ్యవసాయ రుణాలు,మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ బ్యాంకింగ్ సేవలు, ప్రభుత్వ పథకాల అమలు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలకు ఆర్థిక సహకారం, నూతన ఆర్థిక సేవల విస్తరణ వంటి అన్ని రంగాల్లో ఎస్‌బీఐ తరపున పూర్తి స్థాయి వృత్తిపరమైన సహకారాన్ని అందిస్తామని ఆయన స్పష్టం చేశారు. ఈ సమావేశం ఎస్‌బీఐ, ముల్కనూర్ సంఘం మధ్య బంధాన్ని మరింత బలోపేతం చేయడమే కాకుండా.. గ్రామీణాభివృద్ధికి, రైతుల ఆర్థికాభివృద్ధికి కొత్త అవకాశాలను సృష్టిస్తుందని ఇరువర్గాలు ఆశాభావం వ్యక్తం చేశాయి.

# ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియను పరిశీలించిన కాంగ్రెస్ నేతలు



**సికింద్రాబాద్,జులై 10 ( ప్రజామంటలు):** ఓటర్ల జాబితా ప్రత్యేక విస్తృత సవరణ (ఎస్ఎస్ఆర్–2026) కార్యక్రమంలో భాగంగా సనత్‌నగర్ నియోజకవర్గ పరిధి బన్సీలాల్ పేట లోని సీసీ నగర్ కాలనీలో శుక్రవారం ఓటర్ల నమోదు, సవరణ ప్రక్రియ కొనసాగింది. బన్సీలాల్‌పేట్ డివిజన్ సీసీ నగర్ లో కాంగ్రెస్ నాయకులు ఇంటింటికీ తిరుగుతూ స్థానిక ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీతో పాటు దరఖాస్తులను రాయడంలో వారికి సహకరించారు. ఈ కార్యక్రమాన్ని డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఐత చిరంజీవి దగ్గరుండి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని, జాబితాలో ఏవైనా తప్పులు ఉంటే సవరించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కలీమ్,ఎండీ మునీర్,సాయి సందీప్,తదితరులు పాల్గొన్నారు.

# వరంగల్‌లో గవర్నర్ కార్యక్రమం -- టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మనపెల్లి అశోక్ రెడ్డి మర్యాదపూర్వక భేటీ

**ఎల్కతుర్తి జులై 10 ప్రజా మంటలు :** వరంగల్‌లో గవర్నర్ కార్యక్రమం సందర్భంగా గురువారం ఎన్ఐటీ అతిథి గృహంలో తెలంగాణ రాష్ట్ర గవర్నర్‌ను టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మనపెల్లి అశోక్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం, విద్యా రంగానికి సంబంధించిన పలు అంశాలపై సంక్షిప్తంగా చర్చించినట్లు సమాచారం. కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు



# ఎల్కతుర్తిలో స్పీడ్ బ్రేకర్లకు వైట్ లైన్స్ వేయాలని వాహనదారుల డిమాండ్



**ఎల్కతుర్తి జులై 10 ప్రజా మంటలు :** ఎల్కతుర్తి, హనుమకొండ జిల్లా: ఎల్కతుర్తి మండల కేంద్రంలోని ప్రధాన రహదారులపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లకు వైట్ లైన్స్, హెచ్చరిక గుర్తులు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో లేదా వేగంగా ప్రయాణించే సమయంలో స్పీడ్ బ్రేకర్ దగ్గరకు వచ్చేంత వరకు అది కనిపించకపోవడంతో వాహనదారులు ఒక్కసారిగా బ్రేకులు వేయాల్సి వస్తోంది. దీంతో ద్విచక్ర వాహనాలు స్కిడ్ అవడం, వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొనే ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్పీడ్ బ్రేకర్లపై తెలుపు రంగు (వైట్ లైన్స్) లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోందని వాహనదారులు పేర్కొంటున్నారు. ముఖ్యంగా ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ ముందు, కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్ సమీపంలో, బస్ స్టాండ్ పరిసరాల్లో ఉన్న స్పీడ్ బ్రేకర్లకు వెంటనే వైట్ లైన్స్ వేయడంతో పాటు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత రోడ్లు--భవనాల శాఖ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలని వాహనదారులు మరియు స్థానిక ప్రజలు కోరుతున్నారు. ప్రజల భద్రత దృష్ట్యా ప్రమాదాలు జరగకముందే అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను స్పష్టంగా కనిపించేలా తెలుపు రంగుతో గుర్తులు వేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

ప్రజా మంటలు



# స్నేహితుడి పట్ల దారుణం పారిపోతున్నా వెంటపడి - మర్మాంగాలను నలిపేసి

**యువకుడి ప్రాణం తీసిన స్నేహితులు**

**గంజాయి, అమ్మాయి విషయాలే కారణం**



సుహాస్ ను మారుమూల ప్రాంతానికి తీసుకువెళ్లి దారుణంగా హింసించిన వైనం స్నేహితులు పిలిచారు కదా అని నమ్మి అర్ధరాత్రి తర్వాత బయటకు వెళ్లిన ఆ యువకుడు చివరికి విగతజీవిగా మిగిలాడు. అతడిని దారుణంగా కొట్టి చంపినట్లు సమాచారం. ఈ ఘటన రంగారెడ్డి జిల్లాలో చోటుచేసుకుంది. అయితే గంజాయి వ్యాపారంలో లావాదేవీలు, ఓ అమ్మాయి విషయంలో జరిగిన వివాదమే ఈ హత్యకు కారణంగా తెలుస్తోంది. దీనిపై రంగంలోకి దిగిన పోలీసులు, అనుమానిత నిందితుల్లో ఒకరిని విచారించినప్పుడు పలు ఆశ్చర్యకర విషయాలు వెలుగు చూశాయి.విశ్వసనీయ సమాచారం మేరకు, రంగారెడ్డి జిల్లా పసుమాములలో తల్లితో కలిసి ఉంటున్న నిషాని సుహాస్(22)కు గంజాయి వ్యసనం, వ్యాపారం చేసిన అనుభవం ఉంది. సికింద్రాబాద్‌లో ఉన్న సమయంలో కుమారుడు పక్కదారి పడుతున్నాడని గ్రహించిన తల్లి నందిని, పసుమాములలో సొంతింటిని కొనుగోలు చేసింది. భర్త చనిపోయినప్పటికీ భారమంతా తనపై వేసుకుని కుమార్తెకు పెళ్లి చేసింది. ఆశలన్నీ ఒక్కగానొక్క కుమారుడు సుహాస్‌పైనే పెట్టుకొని జీవిస్తోంది.సుహాస్‌కు పసుమాముల, పెద్ద అంబర్‌పేట్, సికింద్రాబాద్ ప్రాంతాలకు చెందిన రాకేశ్?, నడిమిట్ల పరశురాం, రాజులతో పాటు మరొకరితో స్నేహం ఉంది. సుహాస్‌కు సెల్?ఫోన్ లేకపోవడంతో ఈ నలుగురిలో ఒకరి మొబైల్?ను సుహాస్ తీసుకున్నాడు. ఫోన్? ఇచ్చిన యువకుడి గర్ల్‌ఫ్రెండ్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో ఛాటింగ్ చేసేవాడు. సుహాస్ అసభ్యకరంగా మేసేజ్?లు పెట్టడంతో పాటు ఆమె ఫోన్ చేస్తే కూడా అదేవిధంగా మాట్లాడినట్లుగా సమాచారం. జరిగిన విషయమంతా యువతి తన బాయ్‌ఫ్రెండ్‌కు చెప్పింది. గతంలో కలిసి గంజాయి వ్యాపారం చేసిన సమయంలో జరిగిన ఆర్థిక లావాదేవీలపై వివాదాలు తోడవ్వడంతో ఆగ్రహించాడు.మర్రిచెట్టు వద్దకు తీసుకెళ్లి, దాడి చేసి : అదే కారణంతో సుహాస్ అంతు చూడాలని హత్యకు పథకం రచించినట్లుగా సమాచారం. పరశురాం, రాజు, రాకేశ్? సహా మరో వ్యక్తి బుధవారం తెల్లవారుజామున పరశురాం ఇన్‌స్టాగ్రామ్ నుంచి సుహాస్ తల్లి నందిని మొబైల్?కు ఆడియో కాల్ చేశారు. ఆమె ఫోన్ ఎత్తకపోవడంతో నేరుగా ఇంటికెళ్లారు. వారంతా ఫ్రెండ్స్? కావడంతో తల్లి వారించినా సుహాస్ వారితో కలిసి బయటికెళ్లాడు. అక్కడ్నుంచి పసుమాముల గ్రామ శివారులోని మర్రిచెట్టు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ విచక్షణా రహితంగా దాడి చేశారు.తప్పించుకొని ప్రాణభయంతో అర కిలోమీటర్ దూరం పరుగు తీసినప్పటికీ, స్నేహితుడని విడిచిపెట్టకుండా వెంటపడి మర్మాంగాలను నలిపేసి చనిపోయేదాకా కొట్టారు. ఆ తర్వాత పెద్ద అంబర్‌పేట్-పసుమాముల రహదారిలోని శ్మశాన వాటిక ప్రహరీ సమీపంలోని సిమెంట్ బెంచీపై పడుకోబెట్టి పారిపోయారని సమాచారం. వ్యసనాలు, పద్ధతి లేని మిత్రులతో తిరగడంతో తన కుమారుడు చివరికి ప్రాణాలు కోల్పోయాడని సుహాస్ తల్లి కన్నీరుమున్నీరుగా విలపిస్తోంది.పెడదారి పడుతున్న యువత : ఇటీవల కాలంలో గంజాయి, గుట్కా, ఈజీ మనీ, బైక్, కార్? రేసింగ్?లు, ఆన్‌లైన్ జూదం, డ్రగ్స్?, నేర ప్రవృత్తి నేటి యువతను పట్టి పీడిస్తున్నాయి. ఉరుకుల పరుగుల జీవితంలో తల్లిదండ్రులకు తమ పిల్లలపై సరైన దృష్టి లేకపోవడం, వారిపై ప్రేమతో చేసే అతి గారాబం తీవ్ర పరిణామాలకు దారితీస్తోంది. ఈ జాడ్యాలను మొదట్లోనే తుంచనట్లయితే ప్రమాదంలో పడే అవకాశం ఉంది.మరేం చేయాలంటే? : ప్రమాదకర ప్రవర్తన వల్ల కలిగే దుష్పరిణామాల గురించి తల్లిదండ్రులు తమ పిల్లలతో చర్చిస్తూ ఉండాలి. పేరెంట్స్ బలహీనతను గుర్తించడంలో పిల్లలకు ప్రావీణ్యం ఎక్కువగా ఉంటుంది. వారి అభ్యర్థనలను అతి గారాబంతో అంగీకరించినట్లయితే తరవాత తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందనే విషయాన్ని గుర్తించాలి. తల్లిదండ్రులకు బలమైన క్రమశిక్షణ, విలువలు అవసరం. కిశోర వయస్సులైన పిల్లలను క్రమశిక్షణలో పెంచే విషయంలో తల్లిదండ్రులు ఇద్దరూ ఒకే మార్గంలో నడవాలి. ఈ విషయంలో వారి మధ్య విభేదాలు వచ్చినట్లయితే పిల్లల పెంపుదల సజావుగా సాగకపోయే అవకాశం ఉంది.

# మెట్రో రైలు ప్రాజెక్టు-1లో వాటాపై కేంద్రం ఆసక్తి

**విలువ మళ్లీ మదింపు వెనక మతలబు ఇదే!**

**వేర్వేరు యాజమాన్యాలతో మెట్రో నిర్వహణ కష్టమని అభ్యంతరం**

**ఒకే గొడుగు కింద ఉంటేనే మేలంటూ కేంద్రం సంకేతాలు**

**విలువ మళ్లీ మదింపునకు ఇదే కారణమని సమాచారం**



మెట్రో మొదటి ఫేజ్-1 ప్రాజెక్టులో వాటా తీసుకోవాలని కేంద్రం ఆసక్తి చూపిస్తోందా? అందుకే ప్రాజెక్టు విలువను మరోసారి మదింపు చేయిస్తోందా అంటే అవుననే చెబుతున్నారు అధికారులు. కేంద్రప్రభుత్వంతో జరుగుతున్న ఉత్తర ప్రత్యుత్తరాలను పరిశీలిస్తే ఇదే అనిపిస్తోందని చెబుతున్నారు. హైదరాబాద్? మెట్రో ప్రాజెక్టులోని ఫేజ్-1, ఫేజ్-2లు వేర్వేరు యాజమాన్యాల కింద ఉంటే నిర్వహణలో ఇబ్బందులు వస్తాయని అభ్యంతరం చెబుతోందని, ఒకే యాజమాన్యంలో ఉంటే మేలని సూచిస్తోందని సమాచారం. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం వివరాలిలా.అప్పుడు చూద్దామన్న రాష్ట్రం : మెట్రోరైలు ఫేజ్-1లోని ఎల్అండ్‌టీ వాటాను 100% కొనుగోలు చేశాక తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దానికి పూర్తిస్థాయి యాజమాని అవుతుంది. విస్తరణలో భాగంగా చేపట్టనున్న ఫేజ్-2ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త ప్రాజెక్టుగా ప్రతిపాదించారు. నిర్మాణం పూర్తయిన తర్వాత నిర్వహణ సమయంలో సమన్వయ సమస్యలు ఎదురైతే ఎలా పరిష్కరిస్తారంటూ కేంద్ర ప్రభుత్వం గతంలో అడిగింది. ఫేజ్?-2 పూర్తయిన మూడేళ్ల తర్వాత అప్పటి పరిస్థితులకు అనుగుణంగా ఒక అవగాహనకు రావొచ్చని రాష్ట్రం సమాధానమిచ్చింది.కేంద్రం మాత్రం రెండు దశల ప్రాజెక్టులూ ఒకే యాజమాన్యం కింద ఉండాలని భావిస్తున్నట్లు సమాచారం. దేశంలోని అన్ని మెట్రో రైళ్లు ఈ విధానంలో నడుస్తున్నాయని గుర్తుచేస్తోంది. అందుకే ఫేజ్?-1లో భాగస్వామి కావాలని ఆసక్తి చూపిస్తోందని సమాచారం. అదే జరిగినట్లయితే మెట్రోకి హైదరాబాద్‌లో ఉన్న 269 ఎకరాల భూములు, మాల్స్, ఇతరత్రాలన్నీ ఉమ్మడి ఆస్తులుగా మారతాయి.ఉపయోగం ఏమిటంటే :కేంద్రం వాటాదారుగా చేరినట్లయితే ఇదివరకు ఐఆర్ఎఫ్‌సీ ఇస్తానని చెప్పిన 3.5 నుంచి 4 శాతానికంటే తక్కువ వడ్డీకే రుణాలు వచ్చే అవకాశం ఉంటుంది.మెట్రో ఫేజ్-1 నిర్వహణలో నష్టాలు రావడానికి ఏటా చెల్లిస్తున్న రూ.940 కోట్ల వడ్డీ ఒక కారణం. తక్కువ వడ్డీకి లోన్లు తెస్తే ఈ భారం తగ్గుతుంది.గతంలో ఎల్అండ్‌టీ మెట్రోరైలు(హైదరాబాద్) లిమిటెడ్‌కు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రూ.900 కోట్ల వడ్డీలేని లోన్?(సాఫ్ట్‌లోన్) ఇచ్చింది. మదింపులో ఈ మొత్తాన్ని మినహాయించేందుకు తెలంగాణ కేబినెట్ ఆమోదించింది. ఇది కూడా మెట్రో ఫేజ్?-1 విలువను తిరిగి మదింపు చేసేందుకు ఒక కారణమని సమాచారం.సంయుక్త ప్రాజెక్టుల్లో వాటాలు ఇలా : మెట్రో రైలు చట్టంలో ఇటీవల చేసిన మార్పుల ప్రకారం ఉమ్మడి ప్రాజెక్టుల్లో కేంద్ర ప్రభుత్వం వాటా 20%, రాష్ట్రం వాటా 20%, లోన్ల ద్వారా 60% నిధులను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. కేంద్రం వాటా 20% అని చెబుతున్నప్పటికీ భూసేకరణ, నిర్మాణ సమయంలో వడ్డీల ఖర్చును తెలంగాణ రాష్ట్రమే భరించాల్సి ఉంటుంది. అప్పుడు కేంద్రం వాటా 18 శాతమే ఉంటుందని సమాచారం. ఫేజ్-1లో కేంద్రం వాటాను తీసుకున్నట్లయితే మెట్రో తొలి రెండు దశలూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ప్రాజెక్టులు అవుతాయి. అప్పుడు బోర్డులో కేంద్రం, రాష్ట్రం తరఫున అధికారులు డైరెక్టర్లుగా ఉంటారు. సమన్వయంతో ప్రాజెక్ట్ పరుగులు పెడుతుందని కేంద్రం ప్రభుత్వం యోచిస్తోంది.సీఎం లేఖలు రాసినా స్పందన కరవు : మెట్రో రైలు ప్రాజెక్టుపై నిర్ణయాల అమలులో వేగం పెంచాలంటూ సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల కేంద్ర మంత్రులకు మరోమారు లేఖలు రాశారు. ఇప్పటివరకు కేంద్ర గృహ, పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి స్పందన లేదు. విలువను తిరిగి లెక్కించేందుకు గురువారం వరకు ఎస్‌బీఐ క్యాప్స్ ఇంకా ఏర్పాటు కాలేదు. సమన్వయానికి కేంద్ర ప్రభుత్వం తరఫున అధికారిని సైతం నియమించలేదు.మూసీ ప్రాజెక్టుకు రూ.7,345 కోట్లు : ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న మూసీ నది అభివృద్ధి ప్రాజెక్టులో మరో కీలక ముందడుగు పడింది. భూసేకరణ వ్యయం కాకుండా 6% నిర్వహణ ఖర్చులతో ఫేజ్?-1 మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టుకు రూ.7,345.12 కోట్లు వెచ్చించేందుకు అంగీకరిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులను జారీ చేసింది. పరిపాలనా అనుమతి మంజూరవడంతో ప్రాజెక్టుకు సాంకేతిక అనుమతులు తీసుకుని వెంటనే టెండర్ల ప్రక్రియ ప్రారంభిస్తామని ఎంఆర్‌డీసీఎల్ (మూసీ నది పరీవాహక ప్రాంత అభివృద్ధి సంస్థ) వివరించింది.

# తక్కువ ధరకే 'ఇంటీరియర్' చేస్తామంటారు ఆన్‌లైన్ ఫొటోలు చూపి అడ్వాన్స్‌తో మాయమవుతారు

**తక్కువ ధరకే ఇంటీరియర్ పనులు చేస్తామంటూ మోసాలు**

**అడ్వాన్సు తీసుకుని పరారవుతున్న కేటుగాళ్లు**


**అప్రమత్తంగా లేకుంటే మోసగాళ్ల బారిన పడే అవకాశం**



తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నిపుణులు చెబుతున్న సూచనలివే నచ్చిన విధంగా కలల గృహాన్ని నిర్మించుకోవడమే కాదు, లోపల అందంగా కనిపించడం కూడా అంతే ముఖ్యం. చాలా మంది అలా ఇంటిని అందంగా మార్చుకోవాలనుకుంటుంటారు. ఇదే అదనుగా ఆకర్షణీయమైన ఇంటీరియల్? డిజైన్? పనులు తాము అతి తక్కువ ధరకే చేస్తామంటూ కొంతమంది రూ.లక్షల డబ్బు కాజేస్తున్న ఘటనలు ఇటీవల కాలంలో అధికమవుతున్నాయి. ఫ్రీలాంచ్, డబుల్ రిజిస్ట్రేషన్లు, భూ కబ్జాలు, బై బ్యాక్? స్కీమ్?ల మోసాలతో తలలు పట్టుకుంటున్న నగరవాసుల్ని, ఇటీవల కాలంలో ఇంటీరియల్ మోసాలు భయపెడుతున్నాయి.ఇంటీరియల్ డిజైన్?కు అయ్యే మొత్తంలో 50-80 శాతం అడ్వాన్స్?గా తీసుకుని కనిపించకుండా పోవడం, పనులు కొంతమేర ప్రారంభించి మధ్యలోనే వదిలేయడం, కూలీల కొరత సాకు చూపి నెలలుగా పని వాయిదా వేస్తూ ఇళ్ల యజమానులను ముప్పు తిప్పలు పెడుతున్నారు. హైదరాబాద్ నగరంలో ఈ ఏడాది ఇలాంటి తరహా కేసులు 26 నమోదయ్యాయంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో అసలు మోసాలు ఎలా జరుగుతున్నాయి? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలనే విషయాలను ఇప్పుడు చూద్దాం.కొత్త బిల్డింగ్?లే టార్గెట్? : సమీపంలోని ఇళ్లు, ప్రముఖ సంస్థల ప్రాజెక్టుల్లో తామే ఇంటీరియల్? వర్క్ పూర్తి చేశామంటూ ఆన్‌లైన్‌లో సేకరించిన ఫొటోలు, వీడియోలు చూపించి అడ్వాన్సులను రాబట్టుకుంటున్నారు. రెండు మూడు రోజులు పనులు చేసినట్లు నటించి, వాయిదా వేస్తున్నారు. ఫోన్లకు స్పందించకపోగా, అడ్రస్? తెలుసుకుని ఇంటికెళ్తే తిరిగి ఎదురుదాడికి పాల్పడుతున్నారు. పలు మోసాల్లో నిందితులు ఇతర రాష్ట్రాలు, జిల్లాలకు చెందిన వారే అధికంగా ఉంటున్నారు. గతేడాది నారాయణగూడ పోలీసులు ఇంటీరియర్ డిజైనింగ్ పేరుతో మోసగిస్తున్న కోల్‌కతాకు చెందిన పలాస్ పాల్‌ను అరెస్టు చేశారు. ఇతడొక్కడే నగరంలో పలువురు భవన యజమానుల వద్ద రూ.కోటికి పైగా వసూలు చేసి మోసగించినట్లు తేలింది.ఇటీవలి ఉదంతాలు : బోయిన్‌పల్లిలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఇంట్లో ఇంటీరియర్ డిజైనింగ్? కోసం ఓ వ్యక్తికి రూ.8 లక్షలు చెల్లించాడు. అడ్వాన్సు తీసుకున్న డిజైనర్ ఆర్నెల్లయినా పని చేయలేదు. జవహర్‌నగర్‌లో ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా, మరో 15 మందిని రూ.30 లక్షల మేరకు మోసగించినట్లు తెలుసుకుని లబోదిబోమన్నాడు.కొంపల్లి ప్రాంతానికి చెందిన దంపతులు తమ నూతన గృహంలో ఇంటీరియర్ డిజైన్? చేయించడం కోసం ఓ వ్యక్తిని సంప్రదించారు. మార్కెట్?లో అతి తక్కువ ధరకే మొత్తం పని చేస్తామంటూ త్రీడీ బొమ్మలు చూపించి, మాయమాటలు చెప్పి డబ్బు తీసుకుని పత్తాలేకుండా పోవడంతో చివరికి మరొకరితో పని చేయించుకున్నారు. అందువల్ల ఇంటీరియర్ పనిని వేరొకరికి అప్పగించే ముందుకు అన్ని వివరాలను తెలుసుకుని మాత్రమే పని అప్పగించాలి. ఈ నేపథ్యంలో కింద వివరించిన జాగ్రత్తలు తీసుకోవడం మేలు.ఈ జాగ్రత్తలు మేలు :ఇంటీరియర్ డిజైనింగ్ పనులు చేసే వ్యక్తుల నేపథ్యం, విశ్వసనీయత కచ్చితంగా తెలుసుకోవాలి.ప్రస్తుతం, గతంలో పని చేసిన ఇళ్లను నేరుగా సందర్శించి యజమానులతో మాట్లాడి క్వాలిటీ తెలుసుకోవాలి.అవసరాన్ని బట్టి విడతల వారీగా అడ్వాన్సు చెల్లించడం మంచిది.మోసపోతే సమీపంలోని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలి.నమ్మకమైన వారికే పనులు అప్పగించడం మంచిది.పని అప్పగించే ముందు వారి గురించి పూర్తి వివరాలు తెలుసుకోవాలి.పని చేశాకనే మొత్తం నగదును చెల్లించడం మంచిది.తెలియని వారికి పని అప్పగించే ముందు జాగ్రత్త.

## ఫాతిమా ఒవైసీ సంస్థ కేసు ప్రభుత్వ రిపోర్ట్‌పై హైకోర్టు కీలక ప్రశ్నలు

సల్కం చెరువు కబ్జా ఆరోపణలపై దాఖలైన పిటిషన్‌ను విచారించిన తెలంగాణ హైకోర్టు పలు కీలక వ్యాఖ్యలు చేసింది. బండ్లగూడలోని ఫాతిమా ఒవైసీ విద్యాసంస్థ, చెరువు పూర్తిస్థాయి నీటిమట్టం పరిధిలో లేదంటూ ప్రభుత్వం సమర్పించిన నివేదికపై న్యాయస్థానం సందేహం వ్యక్తం చేసింది.గురువారం జస్టిస్ ఎన్.వి. శ్రవణ్ కుమార్ ధర్మాసనం ఈ పిటిషన్‌పై విచారణ చేపట్టింది. రెవెన్యూ, నీటిపారుదల శాఖలు సంయుక్తంగా నిర్వహించిన సర్వే నివేదికను అదనపు అడ్వొకేట్ జనరల్ కోర్టుకు సమర్పించారు. మిషన్ కాకతీయ పనుల వల్ల చెరువు కట్టలో మార్పులు చోటుచేసుకున్నాయని, ప్రస్తుతం ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎటువంటి అక్రమ నిర్మాణాలు లేవని ప్రభుత్వం వాదించింది.అయితే, ప్రభుత్వ నివేదికతో పాటు మ్యాపులను పరిశీలించిన ధర్మాసనం అధికారులను పలు కీలక ప్రశ్నలతో నిలదీసింది. మ్యాపుల్లో చెరువును ఆక్రమించినట్లు కనిపిస్తున్న నిర్మాణాలు ఎఫ్‌టీఎల్ వెలుపల ఉన్నాయని ఎలా చెబుతారని ప్రశ్నించింది. గత పహాణీ రికార్డుల ప్రకారం దాదాపు 39 ఎకరాలుగా ఉన్న చెరువు విస్తీర్ణం ప్రస్తుతం ఎలా తగ్గిందని నిలదీసింది. 2016లో ప్రాథమిక నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు తుది ఎఫ్‌టీఎల్ నోటిఫికేషన్ ఎందుకు జారీ చేయలేదని ఆరా తీసింది. అక్రమ కట్టడాల తొలగింపు విషయంలో అధికారులు అనుసరిస్తున్న తీరుపై కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది.బండ్లగూడ కల్సాలోని సలార్-ఏ-మిల్లత్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడుస్తున్న బారిస్టర్ ఫాతిమా ఒవైసీ ఎడ్యుకేషనల్ క్యాంపస్‌ను సల్కం చెరువు (ఎవీణూ లేక్ ఐడీ: 4001/1) ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో నిర్మించారని న్యాయవాది విజయ్ గోపాల్ పిటిషన్ దాఖలు చేశారు. అయితే, ఇది ప్రజా ప్రయోజన వ్యాజ్యం కాదని, నిర్మాణాలు పూర్తయిన తర్వాత ఇప్పుడు సవాలు చేయడంలో అంతర్యం ఏమిటని విద్యా సంస్థ తరఫు న్యాయవాది వాదించారు. దీనిపై స్పందించిన కోర్టు, టీఎస్-బీపాస్ నిబంధనల ప్రకారం అక్రమ నిర్మాణాలపై ఎవరైనా ఫిర్యాదు చేయవచ్చని స్పష్టం చేసింది.సదరు విద్యా సంస్థలో తరగతులు నిర్వహించేందుకు పాఠశాల విద్యాశాఖ ఇప్పటివరకు తుది అనుమతులు మంజూరు చేయలేదని విచారణ సందర్భంగా వెల్లడైంది. కాగా, పిటిషనర్‌కు సోషల్ మీడియా వేదికగా బెదిరింపులు వస్తున్న నేపథ్యంలో, ఆయనకు తగిన భద్రత కల్పించాలని హైకోర్టు ప్రభుత్వాన్ని ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను ధర్మాసనం వాయిదా వేసింది.




# రాజధానికి భూములిచ్చిన రైతుల అసంతృప్తి

**సీఆర్డీఏ సరిగా పట్టించుకోవట్లేదని ఆరోపణ**

**సమస్యల పరిష్కారంపై మీనమేషాలు లెక్కిస్తోందని రైతుల ఆవేదన**

**గ్రామ కంఠాలు, వీధి పోటు వంటి సమస్యలపై స్పందన లేదని ఆరోపణ**

**అమరావతి అభివృద్ధి సలహా మండలి పేరుతో కమిటీ ఏర్పాటుకు నిర్ణయం**



రాజధానికి భూములిచ్చిన రైతుల సమస్యల పరిష్కారంలో సీఆర్డీఏ మీనమేషాలు లెక్కిస్తోంది. అసైన్డ్ భూములు, గ్రామ కంఠాలు, వీధి పోటు, ఎఫ్?ఎస్?ఐ పెంపు వంటి కీలక సమస్యల విషయంలో అధికారుల నుంచి సరైన స్పందన రావట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య కమిటీ దృష్టికి తెచ్చిన సమస్యలు కూడా ఇంకా పెండింగ్‌లో ఉండటంపై ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకపై ప్రభుత్వం, సీఆర్డీఏ అధికారులతో సంప్రదింపుల కోసం అమరావతి అభివృద్ధి సలహా మండలి పేరుతో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.జగన్ పాలన ఐదేళ్లూ పోరాడుతూనే ఉన్న రైతులు కూటమి ప్రభుత్వం వచ్చాక ఊపిరి పీల్చుకున్నారు. కౌలు గడువును మరో ఐదేళ్లు పెంచడంతో కాస్త ఊరట చెందారు. అయితే రైతులకిచ్చిన ప్లాట్ల అభివృద్ధి, అసైన్డ్ సమస్యలు, గ్రామ కంఠాలు, జరీబు భూములు, భూసమీకరణ జరగని భూముల్లో ప్లాట్ల కేటాయింపు, వీధి పోటు, గ్రామాల మీదుగా వెళ్లే ప్రధాన రహదారులకు భూములివ్వడం వంటి సమస్యలు అలాగే ఉండిపోయాయి.వీటన్నింటినీ రైతులు ప్రభుత్వం ముందుంచారు. వరుస క్రమంలో సమస్యలు పరిష్కరించేలా సీఎం చంద్రబాబు కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, మంత్రి నారాయణ, ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్‌తో త్రిసభ్య కమిటీ ఏర్పాటు చేశారు. కమిటీ పలుమార్లు రైతులతో సమావేశమైంది. సీఆర్డీఏ అధికారులతోనూ చర్చించింది. కానీ ఇప్పటికీ చాలావరకు పెండింగ్‌లోనే ఉన్నాయి.నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం – పరిష్కారంలో ఆలస్యం: సీఆర్డీఏ కమిషనర్లు తరచుగా మారడం వల్ల చాలా సమస్యలు మళ్లీ మొదటి నుంచి వినాల్సి వస్తోంది. దీనివల్ల నిర్ణయాలు తీసుకోవడంలో జాప్యం, పరిష్కారంలో ఆలస్యం జరుగుతోంది. సీఆర్డీఏ కమిషనర్‌కు తోడుగా ప్రభుత్వం ముగ్గురు ఐఏఎస్ అధికారులను అదనపు కమిషనర్లుగా నియమించింది. అయితే కేవలం రైతుల సమస్యల పరిష్కారం కోసమే ఒకరిని నియమిస్తే సమస్యలపై అవగహన, పరిష్కారం సులువు అవుతుంది. కానీ అలా జరక్క సమస్యలు కొలిక్కి రావడం లేదు. చిన్న రైతులు తమ సమస్యలను త్రిసభ్య కమిటీ ముందుకు తీసుకురాలేకపోతున్నారు. నేరుగా సీఆర్డీఏ ఆఫీసుకు వెళ్తే సరిగ్గా స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు.కౌలు సరిగా పడటం లేదు: రాజధానిపై నమోదైన కేసులు సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయి. ఆర్ -5 జోన్ సమస్య అలాగే ఉంది. మరోవైపు గ్రామ కంఠాల గుర్తింపు, వీధి పోటు ప్లాట్ల మార్పు వంటి విషయాల్లో అన్యాయం జరుగుతోందని కొందరు రైతులు ఆరోపిస్తున్నారు. అసైన్డ్ భూముల విషయంలో జగన్ సర్కార్ నాడు సిట్ విచారణకు ఆదేశించడంతో రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. కౌలు సరిగా పడటం లేదు. రిటర్నబుల్ ప్లాట్లు రిజిస్ట్రేషన్‌కు అవకాశం లేకుండా పోయింది. మరికొందరికి ఇంకా ప్లాట్లు కేటాయించలేదు. ఇవన్నీ పరిష్కరించాలని అసైన్డ్ రైతులు కోరుతున్నారు."మేము సీఆర్డీఏ కార్యాలయానికి వెళ్లి మా సమస్యలను చెబుతున్నా, అధికారులు వాటికి కనీస ప్రాధాన్యత ఇవ్వడం లేదు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కమిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు కూడా తగిన అవకాశం కల్పించాలి. అదే విధంగా రాజధాని నిర్మాణం కోసం భూములిచ్చిన అసైన్డ్ రైతులకు ఇప్పటికీ కౌలు రాలేదు." – రాజధాని రైతులుఅమరావతి అభివృద్ధి సలహా మండలి పేరుతో: రైతులకు ఇచ్చిన ప్లాట్ల అభివృద్ధి పనులు మందకొడిగా సాగుతున్నాయి. చాలా చోట్ల రహదారులు, విద్యుత్ సౌకర్యం కల్పించడంతో పాటు తాగునీరు, డ్రైనేజీ వసతులు ఏర్పాటు చేయాలి. వేల కోట్లు అమరావతిలో ఖర్చు చేస్తున్న ప్రభుత్వం రాజధాని గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనను సరిగా పట్టించుకోవట్లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీంతో సమస్యల పరిష్కారానికి అమరావతి అభివృద్ధి సలహా మండలి పేరుతో కమిటీగా ఏర్పడాలని నిర్ణయించారు. రైతుల సమస్యల్ని వ్యక్తిగత కోణంలో కాకుండా ఉమ్మడిగా చూసి పరిష్కరించేందుకు సీఆర్డీఏ అధికారులు ప్రయత్నిస్తున్నారు. సమస్యల్ని ప్రత్యేకంగా చూడాలనే అభిప్రాయం రైతుల్లో వ్యక్తమవుతోంది.

# వార్షిక బ్రహ్మోత్సవాల తేదీల్లో బ్రేక్ దర్శనాలు రద్దు

**టీటీడీ అదనపు ఈవో**

**ఈ ఏడాది అధిక మాసం రావడంతో తిరుమలలో రెండు బ్రహ్మోత్సవాలు**

**ఏర్పాట్లపై అదనపు ఈవో వెంకయ్యచౌదరి సమీక్ష**



బ్రహ్మోత్సవాల రోజుల్లో ప్రొటోకాల్ మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు ఈ ఏడాది అధిక మాసం రావడంతో తిరుమలలో 2 బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. సెప్టెంబర్?లో జరిగే సాలకట్ల (వార్షిక) బ్రహ్మోత్సవాలకు గడువులోగా ఏర్పాటు పూర్తి చేయాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి ఆయా విభాగాధిపతులను ఆదేశించారు. తిరుమలలోని పద్మావతి అతిథి గృహంలో గురువారం వార్షిక బ్రహ్మోత్సవాలపై అదనపు ఈవో తిరుపతి జేఈవో డాక్టర్ ఏ.శరత్, సీవీఎస్?వో మురళీకృష్ణతో కలిసి సమీక్షించారు.ప్రత్యేక దర్శనాలు రద్దు: బ్రహ్మోత్సవాల రోజుల్లో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలకు సిఫార్సు లేఖలు స్వీకరించవద్దన్నారు. చంటిపిల్లల తల్లిదండ్రులు, దివ్యాంగులు, వృద్ధులు,ఎన్?ఆర్?ఐలు, దాతలకు ప్రత్యేక దర్శనాలను రద్దు చేయాలని ఆదేశించారు. క్యూలైన్ల నిర్వహణ, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య పనులు, అన్నప్రసాదం పంపిణీ, లడ్డూల తయారీ, ఆలయ అలంకరణ, ట్రాఫిక్ నియంత్రణ తదితరాలపై అధికారులకు సూచనలు ఇచ్చారు. శ్రీవారి సేవకులుగా యువతను ఆహ్వానించి భక్తులకు మెరుగైన సేవలు అందించాలని వెంకయ్య చౌదరి సూచించారు.జులైలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దయిన తేదీలు: జులైలో 14, 17, 19, 29వ తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేస్తున్నట్లు తెలిపింది టీటీడీ. జులై 14న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 17న ఆణివార ఆస్థానం, జులై 19న శ్రీ ఆండవన్ ఆశ్రమ స్వామీజీకి పెద్ద మర్యాద, 29న జీయర్ స్వాముల చాతుర్మాస సంకల్పం సందర్భంగా శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు.ఆగస్ట్?లో రద్దయిన తేదీలు: ఆగస్ట్ విషయానికొస్తే ఈ నెలలో 22, 24 తేదీల్లో టీటీడీ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసింది. ఆగస్ట్ 22న పవిత్రోత్సవాలకు అంకురార్పణ, ఆగస్ట్ 24వ తేదీన పవిత్రోత్సవాల రెండోరోజు సందర్భంగా పవిత్రాల సమర్పణ నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకుంది.సెప్టెంబర్?లో రద్దయిన తేదీలు: సెప్టెంబర్ విషయానికొస్తే, ఈ నెలలో 8 నుంచి 23 మధ్యలో పలు తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసింది టీటీడీ. సెప్టెంబర్ 8వ తేదీన శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 14వ తేదీన శ్రీవారి బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ, సెప్టెంబర్ 15 నుంచి 23 వరకు శ్రీవారి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సెప్టెంబర్?లో ఆయా తేదీల్లో వీఐపీ బ్రేక్ దర్శనాలను రద్దు చేసినట్లు టీటీడీ ప్రకటించింది. భక్తులు ఈ విషయాన్ని గమనించాలంది. అలాగే, వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దీ చేసిన తేదీలకు ముందురోజు తిరుమలలో ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ సిఫార్సు లేఖలు స్వీకరించబోమని తెలిపింది టీటీడీ.తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ : తిరుమలలో శ్రీవారి సర్వదర్శనానికి టోకెన్లు లేని భక్తులకు 24 గంటల సమయం పడుతోంది. భక్తులతో అన్ని కంపార్టుమెంట్లు నిండిపోయాయి. కంపార్టుమెంట్లు అన్నీ నిండి శిలాతోరణం వరకు భక్తులు క్యూలైన్?లో వేచి ఉన్నారు. జులై 9వ తేదీ గురువారం 70,141 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 33,821 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నట్లు టీటీడీ అధికారులు తెలిపారు. అలాగే, గురువారం శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.23 కోట్లు సమకూరినట్లు వెల్లడించారు.

PRINTED AND PUBLISHED BY V.NARSINGAM, ON BEHALF OF CH.V. PRABHAKAR RAO AND PRINTED AT SRI S HARADHA OFFSET PRINTERS. H.NO.9-14/8/3, BUGGARAM VILLAGE AND MANDAL, BUGGARAM GRAMAPANCHAYATH- 505454, JAGTIAL DISTRICT, TELANGANA STATE.. PUBLISHED AT 6-6-206,PADMA NAGAR, JAGTIAL - 505327, JAGTIAL DISTRICT, TELANGANA STATE. EDITOR : CH V. PRABHAKAR RAO, RNI . TELTEL/2021/81092 : PHONE : 9391533339 EMAIL: prajamantalu@gmail.com